తరంగాలు
రిపోర్టర్లు కావలెను
అతి తక్కువ కాలంలో తెలుగు రాష్ట్రాల్లో అత్యంత ప్రజాదరణ పొందుతున్న 'తరంగాలు' జాతీయ దినపత్రిక నందు పనిచేయుటకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాలోని అన్ని మండలాల నుండి రిపోర్టర్లు కావలెను.
సంప్రదించండి...
ఎడిటర్: గడ్డం నాగరాజు గౌడ్
94949 23460

https://epaper.tharangalu.in
RNI. TELTEL / 2022 / 83463
జాతీయ దిన ప్రతిక
# తరంగాలు
Tharangalu Daily News Paper
ప్రతి అక్షరం.... సామాన్యుడి అస్త్రం...

హైదరాబాద్
సోమవారం
19 అక్టోబర్ 2026
సంపుటి 04
సంచిక 05
పేజీలు 8
వెల రూ.5.00

Published From : Hyderabad,Circulated:Telangana,Andhrapradesh
Epaper: www.tharangalu.in.com

## జర్మనీ ఉద్యోగాల పేరుతో నిరుద్యోగులకు టోమ్‌కామ్ టోకరా?

- 70 మందికి పైగా యువత నుంచి కోట్లాది రూపాయల వసూలు
- రూ.4.5 లక్షలు చెల్లించినా దక్కని ఉద్యోగాలు
- హరీశ్‌రావు ఆరోపణలు.. రెండేళ్లుగా ఎదురుచూపులు
- విచారణ జరిపి బాధితులకు పరిహారం చెల్లించాలని డిమాండ్



హైదరాబాద్, అక్టోబర్ 18: తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ ఆధ్వర్యంలోని తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ నిరుద్యోగ యువతను మోసం చేసే వ్యవస్థగా మారిందని బీఆర్‌ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు ఆరోపించారు. జర్మనీలో ఉద్యోగాలు కల్పిస్తామంటూ 70 మందికి పైగా యువత నుంచి కోట్లాది రూపాయలు వసూలు చేసి, వారికి ఉద్యోగాలు కల్పించకుండా ఇబ్బందులకు గురిచేశారని సామాజిక మాధ్యమ వేదికగా విమర్శించారు. విదేశాల్లో ఉద్యోగాలు సాధించి కుటుంబాలను ఆదుకోవాలనే ఆశతో డబ్బులు చెల్లించిన నిరుద్యోగులు రెండేళ్లుగా ఎదురుచూస్తున్నారని

మిగతా 2వ పేజిలో..



## సొంతూరికి చలో చలో!

- దసరా పండుగకు హైదరాబాద్ నుంచి తరలిన జనం
- జాతీయ రహదారులపై బారులు తీరిన వాహనాలు సొంతూరికి చలో చలో!
- హైదరాబాద్‌లోని బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు కిటకిట

హైదరాబాద్, అక్టోబరు 18 దసరా పండుగను సొంతూరిలో జరుపుకునేందుకు హైదరాబాద్ నుంచి భారీగా ప్రయాణికులు తరలివస్తున్నారు. దీంతో ప్రధాన రహదారులన్నీ రద్దీగా మారాయి. బస్సులు, రైళ్లు కిక్కిరిసిపోతున్నాయి. ఆదివారం హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై వాహనాలు బారులు తీరాయి. సాధారణ రోజుల్లో చౌటుప్పల్ మండలంలోని పంతంగి టోల్‌గేట్ నుంచి దాదాపు 38 వేల వరకూ వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. అయితే ఆదివారం ఈ సంఖ్య 51 వేలు దాటింది. హైదరాబాద్‌లోని ఎంజీబీఎస్, జూబ్లీ బస్టాండ్‌లు, రైల్వేస్టేషన్‌లు ప్రయాణికులతో కిక్కిరిశాయి. రద్దీకి తగినట్లు బస్సులు లేకపోవడంతో ప్రయాణికులు గంటల తరబడి ఎదురు చూశారు. ఆదివారం రాత్రి 8 గంటల వరకు రెగ్యులర్ సర్వీసులతో పాటు

మిగతా 2వ పేజిలో..

## హైదరాబాద్ మెట్రోకు పెరుగుతున్న నష్టాలు

- ఆరు నెలల్లో రూ.405.86 కోట్ల నష్టం
- రూ.524.78 కోట్లకు చేరిన మొత్తం ఆదాయం
- వడ్డీలకే రూ.522.61 కోట్లు ఖర్చు
- రోజుకు రూ.2.85 కోట్ల వడ్డీ భారం



హైదరాబాద్, అక్టోబర్ 18 హైదరాబాద్ మెట్రో రైలు నష్టాల పరంపర కొనసాగుతోంది. ఎల్ అండ్ టీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న తొలి దశ మెట్రో ప్రాజెక్టును తన ఆధీనంలోకి తీసుకుని లాభాల బాట పట్టించాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తున్నప్పటికీ, స్వాధీన ప్రక్రియలో కొన్ని నెలలుగా ప్రతిష్టంభన కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో మెట్రో ఆర్థిక పరిస్థితి మరింత భారంగా మారింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో సెప్టెంబర్ 30తో ముగిసిన తొలి ఆరు నెలల కాలానికి సంబంధించిన ఆర్థిక ఫలితాల ప్రకారం, ఎల్ అండ్ టీ హైదరాబాద్

మిగతా 2వ పేజిలో..

## ఓట్ల చోరీకి మూల్యం తప్పదు: రాహుల్ గాంధీ




- మోదీ, అమిత్ షా, జ్ఞానేశ్ కుమార్‌పై విమర్శలు
- చట్టం ముందు నిలవాల్సి వస్తుందని హెచ్చరిక
- గోవాలో కాంగ్రెస్ గోయ్ రఖోన్ యాత్ర
- రాజ్యాంగ పరిరక్షణకు కట్టుబడి ఉన్నామని వ్యాఖ్య

మర్గావ్, అక్టోబర్ 18 ఓట్ల చోరీకి పాల్పడుతున్నారంటూ ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌పై కాంగ్రెస్ అగ్రనేత, ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ వ్యవహారంలో వారు చేసిన తప్పులకు మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. త్వరలోనే చట్టం ముందు నిలవాల్సిన పరిస్థితి వస్తుందని వ్యాఖ్యానించారు. గోవాలోని మర్గావ్‌లో నిర్వహించిన కాంగ్రెస్ 'గోయ్ రఖోన్ యాత్ర'లో పాల్గొన్న రాహుల్ గాంధీ, అనంతరం ఏర్పాటు చేసిన సభలో ప్రసంగిస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు. ఓటు హక్కు, ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన అంశాలపై ఆయన చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకున్నాయి.గోవాలో నిర్వహించిన యాత్రలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో కలిసి రాహుల్ గాంధీ సుమారు రెండు కిలోమీటర్ల మేర పాదయాత్ర

మిగతా 2వ పేజిలో..



## నామినేషన్ల అడ్డంకులపై జగన్ ఫిర్యాదు

- రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠాకు వినతి
- నామినేషన్లు అడ్డుకుంటున్నారని వైఎస్ జగన్ ఆరోపణ
- రిటర్నింగ్ అధికారులు పత్రాలు తీసుకోవడం లేదని ఫిర్యాదు
- అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలని విజ్ఞప్తి

అమరావతి, అక్టోబర్ 18 ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా నామినేషన్ల ప్రక్రియలో ఎదురవుతున్న

మిగతా 2వ పేజిలో..

## పంజాబ్‌లో ఉపాధి హామీ కార్మికులపై దూసుకెళ్లిన కారు.. 8 మంది దుర్మరణం



పంజాబ్ అక్టోబరు 18 పంజాబ్‌లోని సంగ్రూర్ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. ఉపాధి హామీ కార్మికులపై కారు దూసుకెళ్లడంతో 8 మంది కార్మికులు చనిపోయారు. సంగ్రూర్ జిల్లాలోని లెహ్రాగాగా-జఖర్ రోడ్డులో ఆదివారం ఈ ఘోర ప్రమాదం జరిగింది. దాదాపు 25 మంది కార్మికులు రోడ్డు పక్కన పనిచేసుకుంటూ ఉండగా.. ఒక కారు అకస్మాత్తుగా వారిపై నుంచి దూసుకెళ్లిందని ప్రత్యక్ష సాక్షులు తెలిపారని పోలీసులు చెప్పారు. ప్రమాదంలో ఐదుగురు

మిగతా 2వ పేజిలో..



## ఫ్యూచర్ సిటీలోకి 'మహేశ్వరం'!

- మొత్తం మండలం విలీనం దిశగా అడుగులు
- ప్రస్తుతం 2 గ్రామాలు మాత్రమే ఎఫ్‌సీడీఏలో.. మరో 32 గ్రామాలూ విలీనమయ్యే అవకాశం
- కందుకూరు మండలంలో మిగతా గ్రామాలూ..
- మరింతగా విస్తరించనున్న ఫ్యూచర్ సిటీ
- స్థానికుల విజ్ఞప్తులపై సర్కార్ సానుకూల స్పందన
- రంగారెడ్డి కలెక్టర్‌కు ఉత్తర్వులిచ్చిన ప్రభుత్వం
- త్వరలోనే ఆ గ్రామాల విలీనానికి నోటిఫికేషన్?

రంగారెడ్డి అర్బన్, అక్టోబరు 18 ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న ఫ్యూచర్‌సిటీని మరింతగా విస్తరించేందుకు ప్రభుత్వ కసరత్తు కొనసాగుతోంది. ప్రస్తుతం రంగారెడ్డి జిల్లాలోని 71 గ్రామాలు ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్

మిగతా 2వ పేజిలో..

## ఘనంగా సద్దుల బతుకమ్మ సంబురాలు

- కమ్మని సద్దులు హద్దే లేని ఆటపాటలు
- రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా సద్దుల బతుకమ్మ సంబురాలు
- ట్యాంక్‌బండ్‌పై 700 మంది కళాకారుల ప్రదర్శనల నడుమ హోరెత్తిన ఉత్సవం
- బతుకమ్మ ఆడిన గవర్నర్ సతీమణి జానకి, మంత్రి సీతక్క, సినీనటులు రష్మిక, విజయ్
- బతుకమ్మ ఉత్సవాల్లో పాల్గొనాలని పెళ్లప్పుడే ర ష్మికకు చెప్పా.. తీసుకొచ్చా: విజయ్
- నేను తెలంగాణ కోడలిని.. అందుకే బతుకమ్మ ఆడేందుకు వచ్చా: రష్మిక
- కులమతాలకు అతీతంగా ప్రజలను ఒకచోటకు చేర్చే పండుగ: మంత్రి జూపల్లి





హైదరాబాద్, అక్టోబరు 18 సూర్యుడు పడమట వాలుతుండగా ఆ నారింజ రంగుతో కూడిన చల్లని హాయి అయిన మలిసంధ్యకు మరింత అందాన్ని తెచ్చేలా.. తీరొక్క రంగులతో బతుకమ్మలు ఇళ్లలోంచి వీధుల్లోకొచ్చి ఓ చోట చక్కగా అలికి పరిచిన ముగ్గులపై కొలువుతీరాయి. వాటి చుట్టూ పట్టు పరికిణీలు, పట్టు చీరల్లో నగల ధగధగలు, గాజుల గలగలతో యువతులు, మహిళలు చేరి ఆడిపాడారు. ఉయ్యాలో ఉయ్యాల అంటూ వారు అందుకున్న పాటలకు, కోలాటాల సందడికి, డీజేల మోతకు వీధులు హోరెత్తిపోయాయి. చీకట్లు కమ్ముకుంటుండగా మహిళలంతా బతుకమ్మలను చెరువుల్లో నిమజ్జనం చేసి.. ఒడ్డున కూర్చుని సద్దులు తిని.. పాటలు పాడుకుంటూ ఇళ్లకు కదిలారు.

ఆదివారం సాయంత్రం రాష్ట్రవ్యాప్తంగా పల్లె, పట్నం అన్న తేడా లేకుండా ఇలా సంప్రదాయరీతిలో సద్దుల బతుకమ్మ సంబురాలు కన్నుల పండుగగా జరిగాయి! ప్రభుత్వ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని

మిగతా 2వ పేజిలో..

జాతీయ దిన పత్రిక
# తరంగాలు
THARANGALU DAILY NEWS
సోమవారం, 19 అక్టోబర్ , 2026


## ఘనంగా సద్దుల బతుకమ్మ సంబురాలు

ట్యాంక్‌బండ్‌పై పెద్ద బతుకమ్మ వేడుకలు వైభవోపేతంగా జరిగాయి. విద్యుద్దీపాల అలంకరణల నడుమ పోతురాజుల విన్యాసాలు, డప్పు వాయిద్యకారులు సహా 700 మంది కళాకారుల ప్రదర్శనలు, హుస్సేన్ సాగర్ అలలపై లేజర్ షో, తారాజువ్వలు దూసుకెళ్లడాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. వేడుకలకు గవర్నర్ శివప్రసాద్ శుక్లా, ఆయన సతీమణి జానకీ శుక్లా, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి, మరోమంత్రి సీతక్క, ప్రముఖ సినీనటులు, కొత్త దంపతులు అయిన విజయ దేవరకొండ, రష్మిక, సినీ గీత రచయిత సుద్దాల అశోక్ తేజ తదితరులు వేడుకకు హాజరయ్యారు. ఎల్‌నినో కారణంగా రాష్ట్ర ప్రభుత్వం చేసిన సూచనలను ప్రజలు, రైతులు తప్పకుండా పాటించాలని గవర్నర్ తన ప్రసంగంలో పేర్కొన్నారు. నీటిని, విద్యుత్తును పొదుపుగా వాడుకోవాలని సూచించారు.రంగురంగుల పూలను ఒకచోటకు చేర్చి.. ఆ పూలతోనే అమ్మవారిని కొలిచే గొప్ప పండుగ.. కుల, మతాలకు అతీతంగా ప్రజలందరినీ ఒక చోటకు చేర్చి ఐకమత్యంగా ఉండాలనే సందేశాన్నిచ్చే వేడుక బతుకమ్మ అని జూపల్లి పేర్కొన్నారు. చెరువులు, చేలను పరిరక్షించుకోవాలనే సందేశాన్నిచ్చే పండుగ బతుకమ్మ అని సీతక్క అన్నారు. బతుకమ్మ ఆడటం ద్వారా ఆరోగ్యం బాగుంటుందని, ఆ రకంగా ఇది ఆరోగ్యాన్ని పరిరక్షించే పండుగ అని వివరించారు. అనంతరం విజయ్ దేవరకొండ మాట్లాడారు. తనకు తెలంగాణ పండుగలు అంటే ఎంతో ఇష్టం అని.. అందులోనూ బోనాలు, బతుకమ్మ పండుగలంటే మరీ ఇష్టం అని చెప్పారు. ఫిబ్రవరిలో తమకు వివాహం జరిగిందని, తెలంగాణ పండుగల్లో ఒకటైన పెద్ద బతుకమ్మ పండగ ఎక్కడ జరిగితే అక్కడ బతుకమ్మ ఆడాలని రష్మికకు అప్పట్లోనే తాను చెప్పానని వెల్లడించారు. ఆ ప్రకారంగానే రష్మికను ట్యాంక్‌బండ్‌పై వేడుకల్లో బతుకమ్మను ఆడించేందుకు తీసుకొచ్చానని చెప్పారు.

అనంతరం రష్మిక మాట్లాడారు. తాను తెలంగాణ కోడలినని, ఆ రకంగా రాష్ట్ర సంస్కృతి సంప్రదాయాల్లో పాలు పంచుకోవడం తనకెంతో సంతోషంగా ఉందన్నారు. పెళ్లయ్యాక.. తెలంగాణలో జరిగే అతిపెద్ద బతుకమ్మ పండగలో పాల్గొని బతుకమ్మ ఆడాలని విజయ్ తనకు చెప్పారని అందుకే ఈ బతుకమ్మ ఉత్సవాలకు తాను హాజరయ్యానని చెప్పారు. అప్పట్లో తనను అంతా మేడం అని పిలిచేవారని, తెలంగాణ కోడలినయ్యాక అంతా వదినా అని పిలుస్తున్నారని.. తన పట్ల ఈ అభిమానం ఎప్పటికీ ఇలానే ఉండాలని పేర్కొన్నారు. గవర్నర్ సతీమణి జానకీ శుక్లా, మంత్రి సీతక్క, రష్మిక బతుకమ్మ ఆడారు. హనుమకొండలో పద్మాక్షి ఆలయం వద్ద జరిగిన బతుకమ్మ ఉత్సవాల్లో వేలసంఖ్యలో మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు.

వరంగల్‌లోని పోతన ఆడిటోరియం, ప్రసిద్ధ భద్రకాళి ఆలయ ప్రాంగణం, ఉర్సు కరీమాబాద్‌లోని రంగలీలా మైదానం, వరంగల్ కోట, కాజీపేటలోని వడ్డెపల్లి చెరువుకట్ట, కాశీబుగ్గలోని కోటి లింగాల దేవాలయ ప్రాంగణం వద్దా బతుకమ్మ ఉత్సవాలు ఘనంగా జరిగాయి. మాజీ మంత్రి కొండా సురేఖ హనుమకొండ రాంనగర్‌లో జరిగిన బతుకమ్మ ఉత్సవాల్లో పాల్గొన్నారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో జరిగిన వేడుకలకు మంత్రి పొన్నం ప్రభాకర్ హాజరయ్యారు. నిజామాబాద్ జిల్లా బోర్గాంలో బతుకమ్మ ఆడుతుండగా ఆ వైపు అంబులెన్స్ రావడంతో మహిళలు బతుకమ్మలను పక్కకు తీసి అంబులెన్స్‌కు దారి ఇచ్చి తమ బాధ్యతను చాటుకున్నారు.

### 4క్వింటాళ్ల పూలతో..

ఖమ్మం జిల్లా ప్రజలు. కూసుమంచి మండలం పెరికశింగారం గ్రామంలో 55 అడుగుల భారీ బతుకమ్మను పేర్చారు. గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ జూకూరి గోపాలరావు- విజయలక్ష్మి దంపతుల ఆధ్వర్యంలో ఈ అతి పెద్ద బతుకమ్మను తీర్చిదిద్దారు. ఈ బతుకమ్మ పేర్చడానికి నాలుగు క్వింటాళ్ల పూలు అవసరమయ్యాయి. 25 మంది పదిగంటల పాటు శ్రమించి బతుకమ్మను సిద్ధం చేశారు. గత 25 ఏళ్లుగా ఇక్కడ భారీ ఎత్తుతో బతుకమ్మను పేర్చడం ఆనవాయితీగా వస్తోంది. కాగా కామారెడ్డి జిల్లా భిక్కనూరు మండలం తిప్పాపూర్‌లో బతుకమ్మ నిమజ్జనం సందర్భంగా విషాద ఘటన జరిగింది. ధర్మగల్ల స్వామి (40) అనే ఆర్టీసీ డ్రైవర్ కుటుంబసభ్యులతో కలిసి బతుకమ్మ వేడుకలకు హాజరయ్యాడు. బతుకమ్మను నిమజ్జనం చేస్తుండగా కాలు జారడంతో స్వామి నీళ్లలో మునిగిపోయాడు. కొద్దిసేపటికి అతడిని నీళ్లలోంచి బయటకు తీయగా అప్పగికే మృతిచెందాడు. స్వామికి భార్య శ్యామల, కుమార్తె, కుమారుడు, తల్లిదండ్రులు ఉన్నారు.

## సొంతూరికి చలో చలో!

వెయ్యికి పైగా ప్రత్యేక సర్వీసులను ఏపీ, తెలంగాణ జిల్లాలకు నడిపినట్లు ఆర్టీసీ ఉన్నతాధికారులు తెలిపారు. ఇదిలా ఉండగా, దసరా పండుగకు సొంతూళ్లకు వచ్చే ప్రయాణికులను దృష్టిలో ఉంచుకొని దాదాపు 5వేల ప్రత్యేక బస్సు సర్వీసులు నడపనున్నట్లు ఏపీఎ?సఆర్టీసీ ఇప్పటికే ప్రకటించింది. ఈ ప్రత్యేక బస్సుల్లో అదనపు చార్జీలు కాకుండా, ఆయా మార్గాల్లో రెగ్యులర్ సర్వీసుల్లో ఉన్నచార్జీలే వసూలు చేస్తారు.

## పంజాబ్‌లో ఉపాధి హామీ కార్మికులపై దూసుకెళ్లిన కారు.. 8 మంది దుర్మరణం

అక్కడికక్కడే చనిపోగా.. మిగతా ముగ్గురు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ చనిపోయారని పోలీసులు వెల్లడించారు. అలాగే, గాయపడిన మరికొందరిని ఆసుపత్రికి తరలించారు. మృతులందరినీ సంగ్రూర్ జిల్లా లెహ్రాగాగా సమీపంలోని అలిషెర్ గ్రామానికి చెందిన వారిగా గుర్తించారు.ఇక.. ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్‌ను గుర్తించామని, అతడిని ట్రేస్ చేశామని సంగ్రూర్ పోలీస్ సూపరింటెండెంట్ పల్వీందర్ చీమా తెలిపారు. త్వరలోనే అతడిని అదుపులోకి తీసుకుంటామని వెల్లడించారు. అతడిని పర్గాత్ సింగ్ అలియాస్ కాలాగా గుర్తించామని చెప్పారు. ప్రమాదానికి కారణమైన కారుకు పంజాబ్ రిజిస్ట్రేషన్ నంబర్ ఉందని వెల్లడించారు. రోడ్డు ప్రమాద ఘటనపై పంజాబ్ క్యాబినెట్ మంత్రి కుమార్ గోయల్ విచారం వ్యక్తం చేశారు. గాయపడిన వారికిమెరుగైన చికిత్స అందించాలని అధికారులను ఆయన ఆదేశించారు.

## నామినేషన్ల అడ్డంకులపై జగన్ ఫిర్యాదు

అడ్డంకులపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠాకు ఫిర్యాదు చేశారు. చంద్రబాబు ప్రభుత్వం ఎన్నికల సమయంలో దౌర్జన్యాలకు పాల్పడుతోందని ఆయన ఆరోపించారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో తమ పార్టీ అభ్యర్థులను కనీసం నామినేషన్లు కూడా దాఖలు చేయనివ్వకుండా అడ్డుకుంటున్నారని ఎన్నికల కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే అభ్యర్థులకు నామినేషన్లు సమర్పించే అవకాశం కల్పించాల్సి ఉండగా, కొన్ని చోట్ల అడ్డంకులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. ఈ పరిణామాలు ఎన్నికల ప్రక్రియపై ప్రభావం చూపుతున్నాయని ఫిర్యాదులో వివరించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.పలు ప్రాంతాల్లో రిటర్నింగ్ అధికారులు అభ్యర్థుల నుంచి నామినేషన్ పత్రాలను స్వీకరించడానికి నిరాకరిస్తున్నారని వైఎస్ జగన్ ఆరోపించారు. నామినేషన్ల దాఖలుకు అవసరమైన ప్రక్రియను పూర్తి చేసేందుకు అభ్యర్థులు ప్రయత్నిస్తున్నప్పటికీ, వారికి సహకారం అందడం లేదని ఎన్నికల కమిషనర్‌కు వివరించినట్లు తెలిపారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికల్లో పాల్గొనేందుకు ప్రతి అభ్యర్థికి అవకాశం ఉండాలని, నామినేషన్ పత్రాల స్వీకరణలో నిబంధనలను పాటించేలా చర్యలు తీసుకోవాలని కోరినట్లు పేర్కొన్నారు. అభ్యర్థులు తమ నామినేషన్లను సమర్పించకుండా అడ్డుకోవడం వల్ల ఎన్నికల్లో పోటీ చేసే అవకాశాలకు విఘాతం కలుగుతోందని ఆయన ఫిర్యాదు చేసినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి.

నామినేషన్ల ప్రక్రియలో చోటుచేసుకుంటున్న ఘటనలకు సంబంధించి పోలీసుల వ్యవహారశైలిపైనా వైఎస్ జగన్ ఫిర్యాదు చేసినట్లు సమాచారం. తెలుగుదేశం పార్టీకి చెందిన కొందరు వ్యక్తులకు పోలీసులు సహకరిస్తున్నారని ఆయన ఆరోపించారు.

## ఫ్యూచర్ సిటీలోకి 'మహేశ్వరం'!

అథారిటీ(ఎ?ఫసీడీఏ) పరిధిలో ఉండగా.. మరిన్ని గ్రామాలను విలీనం చేసే దిశగా అడుగులు పడుతున్నాయి. అయితే, మహేశ్వరం మండలంలోని 32 రెవెన్యూ గ్రామాలు, కందుకూరు మండలంలోని మిగిలిన గ్రామాలను సైతం ఎఫ్‌సీడీఏలో చేర్చేందుకు ప్రతిపాదనలు సిద్ధమవుతున్నాయి. ఆయా గ్రామాల విలీనం పూర్తయితే మహేశ్వరం, కందుకూరు మండలాలు పూర్తిగా ఫ్యూచర్‌సిటీ పరిధిలోకి రానున్నాయి.

రాజధాని హైదరాబాద్‌కు సమీపంలోనే మరో అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో నూతన నగరాన్ని నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. దేశంలోనే మొదటిసారి నెట్‌జీరో గ్రీన్‌ఫీల్డ్ స్మార్ట్ సిటీని నిర్మించేందుకు మాస్టర్ ప్లాన్‌ను సైతం సిద్ధం చేయడమే కాకుండా ఫ్యూచర్‌సిటీ డెవలప్‌మెంట్ అథారిటీని ఏర్పాటు చేసింది. ప్రస్తుతం ఎఫ్‌సీడీఏ పరిధిలో 71 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయి. అయితే, మహేశ్వరం మండలంలోని అన్ని గ్రామాలను ఫ్యూచర్‌సిటీలో చేర్చాలంటూ స్థానికులు ఇటీవల సీఎం దృష్టికి తీసుకెళ్లగా.. సానుకూలంగా స్పందించారు. ఈ మేరకు కందుకూరు, మహేశ్వరం మండలంలోని అన్ని గ్రామాలను ఎఫ్‌సీడీఏ పరిధిలోకి చేర్చేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అయితే, రాజకీయ పరిస్థితుల కారణంగా కొన్ని గ్రామాల నుంచి తీర్మానాలు అందకపోవడంతో విలీనంపై అధ్యయనం చేసి, చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మహేశ్వరం, కందుకూరు మండలాల్లోని అన్ని గ్రామాలను ఎఫ్‌సీడీఏలో చేర్చేందుకు కసరత్తు ప్రారంభం కాగా.. త్వరలోనే నోటిఫికేషన్ విడుదల కానుంది.

### హెచ్‌ఎండీఏ నుంచి ఎఫ్‌సీడీఏలోకి

ప్రస్తుతం ఎఫ్‌సీడీఏ పరిధిలో మహేశ్వరం మండలంలోని మొహబత్‌నగర్, తమ్మలూరు గ్రామాలు మాత్రమే ఉన్నాయి. మిగతా 32 రెవెన్యూ గ్రామాలైన అకన్‌పల్లి, ఆల్ల?మసగూడ, అమీర్‌పేట, బాగ్‌మంఖాల్, దబిల్‌గూడ, దిల్వార్‌గూడ, దుబ్బచెర్ల, గంగారం, ఘట్‌పల్లి, గొల్లూరు, ఇమాంగూడ, కల్వకోల్, కోళ్లపడ్కల్, కొంగర కుర్దు, మహేశ్వరం, మలిక్దాన్‌గూడ, మంఖాల్, మన్‌సాన్‌పల్లి, మొహబ్బత్‌నగర్, నాగారం, నాగిరెడ్డిపల్లి, నందపల్లి, పెండ్యాల, పోరండ్ల, రావిర్యాల, సర్దార్‌నగర్, సిరిగిరిపూర్, శ్రీనగర్, సుభాన్‌పూర్, తుమ్మలురు, తుప్రాకుర్దు, వెంకన్నగూడను త్వరలో ఎఫ్‌సీడీఏలో విలీనం చేయనున్నారు.కందుకూరు మండలానికి సంబంధించి దాసర్లపల్లి, అన్మోజిగూడ, దెబ్బడగూడ, గూడూరు, గుమ్మడవెల్లి, కందుకూరు, కొత్తూరు, గఫూర్‌నగర్, లేమూర్, మాధాపూర్, మీర్‌ఖాన్‌పేట-బేగరికంచ, మహమదానగర్, ముచ్చర్ల, పంజగూడ, రాచులూరు, సార్వరావులపల్లి, తిమ్మాపూర్, మురళీనగర్, దన్నారం, చిప్పలపల్లి, నేదునూరు, అక్బర్జ, అలీఖాన్‌పల్లి, బాచుపల్లి, పెరుగడ్డ, పులిమామిడి, జైత్వారం కల్సా, జైత్వారం మక్తా గ్రామాలు ఫ్యూచర్‌సిటీ పరిధిలో ఉండగా.. మిగతా గ్రామాల విలీనానికి కసరత్తు చేస్తున్నారు. మహేశ్వరం, కందుకూరు మండలాల్లోని గ్రామాలన్నీ కూడా ఎఫ్‌సీడీఏలో విలీనమైతే.. లేఅవుట్ల అనుమతుల కోసం హైదరాబాద్‌లోని హెచ్‌ఎండీఏ కార్యాలయానికి వెళ్లాల్సిన అవసరం ఉండదని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. మీర్‌ఖాన్‌పేట-బేగరికంచెలో ఉన్న ఎఫ్‌సీడీఏ కార్యాలయంలోనే అనుమతులు తీసుకునే అవకాశం ఉంటుందని చెబుతున్నారు.

### మొదట 56 గ్రామాలతో మాస్టర్‌ప్లాన్

ఇబ్రహీంపట్నం, మహేశ్వరం, కల్వకుర్తి నియోజకవర్గాల పరిధిలోని 56రెవెన్యూ గ్రామాల పరిధిలో... 30వేల ఎకరాల్లో....మొత్తం 765.28 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఫ్యూచర్ సిటీని నిర్మించాలని తొలుత మాస్టర్‌ప్లాన్ రూపొందించారు. కొన్ని రోజుల క్రితం మరో 15 గ్రామాలు విలీనం అయ్యాయి. వీటితో యాచారం మండలంలోని అన్ని గ్రామాలు ఎఫ్‌సీడీఏ పరిధిలోకి చేరాయి. దీంతో మొత్తం ఎఫ్‌సీడీఏ పరిధి ప్రస్తుతం 71 రెవెన్యూ గ్రామాలకు చేరింది. మహేశ్వరం మండలంలోని అన్ని గ్రామాలు విలీనం కానుండటంతో ఎఫ్‌సీడీఏ పరిధి మరింత విస్తరించనుంది. ఇప్పటికే ఎఫ్‌సీడీఏలో విలీనమైన గ్రామాల్లో ఉన్న నీటి వనరులు, భూములు, ఇళ్లు, తదితర లెక్కలు తీస్తున్నారు. సరిహద్దులను గుర్తించి మ్యాపులను సిద్ధం చేస్తున్నారు. చెరువులు, కుంటలు, ఇళ్లతోపాటు ప్రభుత్వ, అటవీ, పట్టా భూములు, తదితర పూర్తి వివరాలను నమోదు చేస్తున్నారు. ఆయా గ్రామాల్లో చేపట్టనున్న అభివృద్ధి పనులపై ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపేందుకు సన్నద్ధమవుతున్నారు.

## హైదరాబాద్ మెట్రోకు పెరుగుతున్న నష్టాలు

మెట్రో రూ.405.86 కోట్ల నష్టాన్ని నమోదు చేసింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో రూ.380.46 కోట్ల నష్టం నమోదుకాగా, ఈసారి నష్టాలు మరింత పెరిగాయి.మెట్రో నిర్వహణ ద్వారా వచ్చే ఆదాయం గత ఏడాదితో పోలిస్తే కొంత పెరిగినప్పటికీ, ఖర్చులను అధిగమించే స్థాయికి చేరుకోలేకపోయింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకు ఆరు నెలల్లో మెట్రో రైలు నిర్వహణ, ఇతర కార్యకలాపాల ద్వారా రూ.524.78 కోట్ల ఆదాయం సమకూరింది. గత ఏడాది ఇదే కాలంలో రూ.497.54 కోట్ల ఆదాయం వచ్చింది. అంటే ఆదాయంలో పెరుగుదల నమోదైనప్పటికీ, మొత్తం వ్యయాలు కూడా భారీగా పెరగడంతో నష్టాలను తగ్గించలేకపోయింది. ప్రయాణికుల రవాణా, ఇతర కార్యకలాపాల ద్వారా వస్తున్న ఆదాయం ప్రాజెక్టు ఆర్థిక భారాన్ని భరించడానికి సరిపోవడం లేదని ఈ గణాంకాలు సూచిస్తున్నాయి.

మెట్రో నష్టాలకు ప్రధాన కారణాల్లో రుణాలపై చెల్లించాల్సి వస్తున్న వడ్డీ భారం కీలకంగా మారింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి ఆరు నెలల్లోనే వడ్డీ చెల్లింపుల కోసం రూ.522.61 కోట్లు ఖర్చయ్యాయి. ఈ మొత్తం మెట్రోకు వచ్చిన రూ.524.78 కోట్ల ఆదాయానికి దాదాపు సమానంగా ఉంది. ఫలితంగా ఆదాయంలో అధిక భాగం వడ్డీల చెల్లింపులకే వెచ్చించాల్సిన పరిస్థితి ఏర్పడింది. అందుబాటులో ఉన్న గణాంకాల ప్రకారం, రుణాలపై వడ్డీ భారం రోజుకు సగటున సుమారు రూ.2.85 కోట్లకు చేరుతోంది. భారీ రుణాలు, వాటిపై నిరంతరం పెరుగుతున్న వడ్డీ చెల్లింపులు మెట్రో ప్రాజెక్టు ఆర్థిక నిర్వహణకు ప్రధాన సవాలుగా నిలుస్తున్నాయి.

ఇక మెట్రో రైలు నిర్వహణతోపాటు ఉద్యోగుల జీతభత్యాలు, నిర్మాణానికి సంబంధించిన ఖర్చులు, పరిపాలనా వ్యయాలు, తరుగు వంటి ఇతర అంశాలు కూడా మొత్తం వ్యయాన్ని పెంచుతున్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకు ఈ అన్ని ఖర్చులు కలిపి రూ.930.64 కోట్లకు చేరాయి. గత ఏడాది ఇదే ఆరు నెలల కాలంలో మొత్తం వ్యయం రూ.878 కోట్లుగా నమోదైంది. అంటే ఏడాదిలో వ్యయభారం గణనీయంగా పెరిగింది. ఇందులో మెట్రో రైళ్ల నిర్వహణ కోసం మాత్రమే రూ.222.88 కోట్లు ఖర్చయ్యాయి. ఆదాయం పెరిగినప్పటికీ, నిర్వహణ వ్యయాలు, వడ్డీలు, ఇతర చెల్లింపులు కలిపి ఆదాయాన్ని మించిపోవడంతో నష్టాలు కొనసాగుతున్నాయి.

ఎల్ అండ్ టీ నుంచి మెట్రో ప్రాజెక్టును స్వాధీనం చేసుకునే ప్రక్రియలో నెలకొన్న ప్రతిష్టంభన నేపథ్యంలో, ప్రాజెక్టు భవిష్యత్తుపై ఆసక్తి నెలకొంది. మెట్రోను ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకుని ఆర్థికంగా మెరుగైన స్థితికి తీసుకురావాలన్న లక్ష్యం ఉన్నప్పటికీ, ప్రస్తుతానికి నష్టాలు తగ్గకపోవడం సవాలుగా మారింది. ఆదాయం పెంపుతోపాటు రుణాలపై వడ్డీ భారాన్ని తగ్గించడం, నిర్వహణ వ్యయాలను సమర్థంగా నియంత్రించడం వంటి అంశాలు ప్రాజెక్టు ఆర్థిక స్థిరత్వానికి కీలకం కానున్నాయి. అయితే, స్వాధీన ప్రక్రియ ఎప్పుడు పూర్తవుతుంది, మెట్రో నష్టాలను తగ్గించేందుకు ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుంటుంది అనే అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది.

## ఓట్ల చోరీకి మూల్యం తప్పదు: రాహుల్ గాంధీ




చేశారు. అనంతరం జరిగిన సభలో పాల్గొని పార్టీ కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఎన్నికల ప్రక్రియలో అక్రమాలు జరుగుతున్నాయని ఆరోపిస్తూ కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. ఓట్ల చోరీకి పాల్పడుతున్నారని తాము భావిస్తున్న అంశాలపై పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ చేపట్టిన యాత్రలో పాల్గొన్న ఆయన, ఎన్నికల వ్యవస్థకు సంబంధించిన ఆరోపణలను ప్రజల ముందుకు తీసుకెళ్లారు.ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ ఓట్ల చోరీకి పాల్పడుతున్నారని రాహుల్ గాంధీ ఆరోపించారు. ఈ వ్యవహారంలో ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఆయనకు అండగా నిలుస్తున్నారని విమర్శించారు. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత, ఓటర్ల హక్కుల పరిరక్షణకు సంబంధించిన అంశాలను ప్రస్తావిస్తూ అధికార పక్షంపై తన విమర్శలను కొనసాగించారు. అయితే, ఇవి రాహుల్ గాంధీ చేసిన ఆరోపణలు మాత్రమే. ఈ ఆరోపణలకు సంబంధించి సంబంధిత వ్యక్తులు లేదా సంస్థల స్పందన ఈ వార్తలో అందుబాటులో లేదు.కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ రాజ్యాంగాన్ని పరిరక్షించే శక్తిగా నిలుస్తుందని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. రాజ్యాంగ విలువలను కాపాడటం, ప్రజాస్వామ్య వ్యవస్థను పరిరక్షించడం తమ పార్టీ బాధ్యతగా భావిస్తోందని ఆయన వ్యాఖ్యానించారు. ఓటు హక్కు, ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన అంశాలపై కాంగ్రెస్ తన పోరాటాన్ని కొనసాగిస్తుందని సంకేతాలిచ్చారు. గోవాలో నిర్వహించిన యాత్ర ద్వారా పార్టీ శ్రేణులతో కలిసి ప్రజల్లోకి వెళ్లిన ఆయన, సభలో చేసిన ప్రసంగంలోనూ రాజ్యాంగ పరిరక్షణ అంశానికి ప్రాధాన్యం ఇచ్చారు.మోదీ, అమిత్ షా, జ్ఞానేశ్ కుమార్‌లను ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలిపెట్టేది లేదని రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. ఓట్ల చోరీకి సంబంధించిన ఆరోపణలపై బాధ్యులు చట్టం ముందు నిలవాల్సి వస్తుందని మరోసారి హెచ్చరించారు. వారు తమ తప్పులకు తగిన మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని వ్యాఖ్యానించారు. గోవాలో కాంగ్రెస్ నిర్వహించిన గోయ్ రఖోన్ యాత్ర, మర్గావ్ సభ సందర్భంగా ఆయన చేసిన ఈ వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీశాయి. ఎన్నికల ప్రక్రియపై కాంగ్రెస్ లేవనెత్తుతున్న అభ్యంతరాలు, వాటిపై అధికార పక్షం స్పందన తదుపరి పరిణామాల్లో కీలకంగా మారనున్నాయి.

## జర్మనీ ఉద్యోగాల పేరుతో నిరుద్యోగులకు టోమ్‌కామ్ టోకరా?

పేర్కొన్నారు. ప్రభుత్వ సంస్థ ద్వారా ఇలాంటి పరిస్థితి ఏర్పడటంపై ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు.హరీశ్‌రావు వివరాల ప్రకారం, సుమారు 15 జిల్లాలకు చెందిన 70 నుంచి 75 మంది నిరుద్యోగ యువకుల నుంచి టోమ్‌కామ్ ఒక్కొక్కరి వద్ద రూ.4.10 లక్షల చొప్పున వసూలు చేసింది. పరీక్షలు, బీమా, వీసా ఖర్చులు కలిపితే ఒక్కో అభ్యర్థికి దాదాపు రూ.4.5 లక్షల వరకు వ్యయం అయిందని ఆయన తెలిపారు. వీరిలో చాలామంది పేద రైతు కుటుంబాలకు చెందినవారని, విదేశాల్లో ఉద్యోగాలు వస్తాయనే నమ్మకంతో కుటుంబ సభ్యుల బంగారాన్ని తాకట్టు పెట్టి, అప్పులు చేసి మరీ డబ్బులు చెల్లించారని వివరించారు. ఉద్యోగాలు వస్తాయని ఆశించిన యువతకు రెండేళ్లు గడిచినా ఫలితం లేకపోవడంతో అప్పులపై వడ్డీలు చెల్లిస్తూ కుటుంబాలను పోషించుకోవడం కష్టంగా మారిందని హరీశ్‌రావు ఆవేదన వ్యక్తం చేశారు.

బాధితుల్లో ఒక్కరికి కూడా జర్మనీలోని కంపెనీల నుంచి ఇంటర్వ్యూ అవకాశం రాలేదని హరీశ్‌రావు ఆరోపించారు. జర్మన్ భాషలో బీ1 స్థాయి పరీక్షలో ఉత్తీర్ణులైన అభ్యర్థులను ఇప్పుడు బీ2 స్థాయి పరీక్షలో ఉత్తీర్ణులు కావాలని కోరుతూ కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. తొమ్మిది మంది అభ్యర్థులు జర్మనీ వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నారని టోమ్‌కామ్ ప్రచారం చేసినప్పటికీ, వారిలో ఒక్కరు కూడా వెళ్లలేదని పేర్కొన్నారు. అభ్యర్థులతో కుదుర్చుకున్న ఒప్పందంలో వివాదాలు తలెత్తితే సుమారు వెయ్యి కిలోమీటర్ల దూరంలోని లక్నో న్యాయస్థానాన్ని ఆశ్రయించాలనే నిబంధన పెట్టడాన్ని ఆయన తప్పుబట్టారు. టోమ్‌కామ్ ద్వారా ఇప్పటివరకు ఎంతమందికి ఉద్యోగాలు కల్పించారో సమాచార హక్కు చట్టం కింద అడిగినా, గడువు ముగిసినప్పటికీ సమాధానం ఇవ్వలేదని ఆరోపించారు.బాధితులు రెండేళ్లుగా ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న సమయంలో ఈ ఏడాది జూన్‌లో కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి కొత్త టోమ్‌కామ్ బ్యాచ్‌ను ప్రారంభించి ఉద్యోగాలపై హామీలు ఇవ్వడం బాధితులను అవమానించడమేనని హరీశ్‌రావు విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు ఇచ్చిన రెండు లక్షల ఉద్యోగాల హామీ ఏమైందని, ప్రకటించిన ఉద్యోగాల ప్రణాళిక అమలు ఎక్కడిదాకా వచ్చిందని ప్రశ్నించారు. నిరుద్యోగులకు ఉపాధి కల్పించాల్సిన ప్రభుత్వ సంస్థే ఉద్యోగాల పేరుతో డబ్బులు చెల్లించిన యువతను ఇబ్బందులకు గురిచేస్తోందన్నది తన ప్రధాన ఆరోపణగా పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై ప్రభుత్వం వెంటనే స్పందించి బాధితుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.టోమ్‌కామ్, ఫెయిర్‌స్టేట్ ఇండియా సంస్థల ద్వారా వసూలు చేసిన మొత్తాన్ని బాధితులకు తిరిగి చెల్లించాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. యువత కోల్పోయిన రెండేళ్ల కాలానికి, వారు భరించిన వడ్డీ భారానికి, మానసిక వేదనకు తగిన పరిహారం అందించాలని కోరారు. ఉద్యోగాలు ఆశించి డబ్బులు చెల్లించిన వారందరికీ ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించాలని, ఈ వ్యవహారంపై నేర పరిశోధన విభాగం లేదా న్యాయ విచారణ జరిపి బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఫీజుల రూపంలో ఎంత వసూలు చేశారు, ఇప్పటివరకు ఎంతమందికి ఉద్యోగాలు కల్పించారు అనే వివరాలతో శ్వేతపత్రం విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. బాధితులకు న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ అండగా ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. ఇవన్నీ హరీశ్‌రావు చేసిన ఆరోపణలు కాగా, వాటిపై సంబంధిత సంస్థలు, ప్రభుత్వం స్పందన తెలియాల్సి ఉంది.

## అంజయ్య జీవితం స్ఫూర్తి దాయకం

టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్

హైదరాబాద్/ హైదరాబాద్ అక్టోబరు 18 ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సామాన్య కార్మికుడిగా జీవితం ప్రారంభించి అంచెలంచెలుగా రాష్ట్ర ముఖ్యమంత్రి స్థాయికి ఎదిగిన మాజీ సీఎం టంగుటూరి అంజయ్య జీవితం నేటితరం రాజకీయ నాయకులకు ఆదర్శనీయం అని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. మాజీ సీఎం, కేంద్ర మాజీ కార్మికశాఖ మంత్రి అంజయ్య 40వ వర్ధంతి సందర్భంగా ఆదివారం హైదరాబాద్‌లోని లుంబినీ పార్కు వద్ద ఆయన విగ్రహానికి పూలమాల వేసి మహేశ్ కుమార్ గౌడ్ నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పరిమిత విద్యాభ్యాసం చేసినా సామాన్యులు, కార్మికుల కష్టాలపై అంజయ్యకు లోతైన అవగాహన ఉండేదన్నారు. పేదల సంక్షేమానికి ప్రాధాన్యం ఇచ్చి, మంచి నేతగా గుర్తింపు పొందిన అంజయ్య.. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ మనస్సును చూరగొన్న నాయకుడిగా నిలిచారన్నారు. కృషి, ఓర్పు, ప్రజల పట్ల నిబద్ధత, అంకిత భావంతో పని చేస్తే సామాన్య కార్యకర్త నుంచి సీఎం స్థాయికి ఎదగవచ్చునని అంజయ్య నిరూపించారన్నారు.

THARANGALU DAILY NEWS
సోమవారం, 19 అక్టోబర్ , 2026
జాతీయ దిన పత్రిక
తరంగాలు

# సద్దుల బతుకమ్మ సంబరాల్లో సీనియర్ నాయకులు వీరారెడ్డి అనురాధ నరేందర్ రెడ్డి



**కుత్బుల్లాపూర్, అక్టోబర్ 18, ( తరంగాలు )**
తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకుని, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు వీరారెడ్డి నరేందర్ రెడ్డి సతీమణి శ్రీమతి అనురాధ రంగురంగుల బతుకమ్మలతో పండుగ సంబరాల్లో పాల్గొన్నారు.

తెలంగాణ ఆడపడుచులు ఎంతో భక్తిశ్రద్ధలతో జరుపుకునే బతుకమ్మ పండుగ మహిళల ఐక్యతకు, తెలంగాణ సాంస్కృతిక వైభవానికి ప్రతీకగా నిలుస్తుందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. బతుకమ్మ పండుగ ప్రతి ఇంటా సంతోషాలు నింపాలని, తెలంగాణ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు.

# మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేసిన ఎమ్మెల్యే కుంభం

**యాదాద్రి భువనగిరి జిల్లా ఆర్ సి అక్టోబర్ 18 తరంగాలు**
వలిగొండ మండల పరిధిలోని గోపరాజుపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు ఊదరి దశరథ అనారోగ్యంతో మృతి చెందడంతో భువనగిరి ఎమ్మెల్యే కంభం అనిల్ కుమార్ రెడ్డి 10 వేల ఆర్థిక సహాయం ప్రకటించారు.ఆదివారం గ్రామ సర్పంచ్ సలిగంజి పృద్వి మృతిని కుటుంబానికి ఎమ్మెల్యే పంపించిన నగదు అందజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షులు సలిగంజి బిక్షపతి,నాయకులు పాలకూర్ల మల్లేశం,చిల్లర స్వామి,నల్లబోలు ధర్మేందర్,పూలగూర్ల నర్సిరెడ్డి,కోమటిరెడ్డి మల్లారెడ్డి, సలిగంజి బిక్షపతి,రుద్రపల్లి యాదయ్య,సంగపాక స్వామి,ఊదరి శోభన్ బాబు తదితరులు పాల్గొన్నారు.

# మండల కేంద్రంలోఘనంగా సద్దుల బతుకమ్మ సంబరాలు



**సంగెం,అక్టోబర్18తరంగాలు**
తెలంగాణ సాంస్కృతి సాంప్రదాయాలు ప్రతీక అయిన సద్దుల బతుకమ్మ పండుగను సంగెం మండల కేంద్రంలో ప్రజలు అత్యంత భక్తిశ్రద్ధలతోఘనంగా జరుపుకున్నారు. ఈ వేడుకల్లో భాగంగా సంగెం మండలం మాజీ ఎంపీపీ కందగట్ల కళావతి నరహరి తన నివాసంలో బతుకమ్మ వేడుకలను కన్నుల పండువగా నిర్వహించారు.?ఈ సందర్భంగా ఆమె ప్రకృతికి ప్రతీకలైన తంగేడు, గునుగు, చామంతి, బంతి తదితర రంగురంగుల పూలతో బతుకమ్మను ఎంతో భక్తితో , అందంగా తీర్చిదిద్దారు.
ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ కందగట్ల కళావతి నరహరి మాట్లాడుతూ... పూలను దేవుడిగా భావించి కొలిచే ఏకైక వేడుక బతుకమ్మ అని అన్నారు. ఆడపడుచులందరూ ఒకచోట చేరి సంతోషాన్ని పంచుకునే ఈ అద్భుతమైన పండుగ ప్రతి ఒక్కరి జీవితంలో సుఖసంతోషాలను, సిరులను నింపాలని మనసారా ఆకాంక్షించారు. తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత మన అందరిపై ఉందని ఆమె పేర్కొన్నారు.?ఈ కార్యక్రమంలో పలువురు మహిళలు, స్థానిక ప్రజలు, ప్రజాప్రతినిధులు ఉత్సాహంగా పాల్గొని బతుకమ్మ పాటలతో, చప్పట్లతో ప్రాంగణాన్ని మార్మోగించారు.

# పూల పండుగకు ఘన వీడ్కోలు మహబూబాబాద్‌లో వైభవంగా సద్దుల తుకమ్మ

- పూల సింగిడికి ఘన వీడ్కోలు..మహబూబాబాద్‌లో అంగరంగ వైభవంగా సద్దుల బతుకమ్మ!

తెలంగాణ సంస్కృతికి ప్రతీకగా సద్దుల బతుకమ్మ మహబూబాబాద్‌లో ఘనంగా నిమజ్జన వేడుకలు!



**మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 18(తరంగాలు ):**
మహబూబాబాద్ జిల్లా పట్టణంలో సద్దుల బతుకమ్మ పండుగ సందర్భంగా నిర్వహించిన బతుకమ్మ నిమజ్జన కార్యక్రమంలో, ఎమ్మెల్యే భూక్యా మురళి నాయక్ , ఎంపీ బలరాం నాయక్ మహబూబాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ గుగులోత్ జ్యోతి రమేష్ నాయక్ , యంయల్ సి తక్కెళ్ళపల్లి రవీంద్రరావు పాల్గొన్నారు.జ్యోతి రమేష్ నాయక్ మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను మహిళలు, ఆడపడుచులు అత్యంత భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. రంగురంగుల పూలతో పేర్చిన బతుకమ్మల చుట్టూ పాటలు పాడుతూ, కోలాటాలు ఆడుతూ పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బతుకమ్మ నిమజ్జన కార్యక్రమంలో పాల్గొన్న చైర్ పర్సన్ జ్యోతి రమేష్ నాయక్ మహిళలకు, ఆడపడుచులకు సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు తెలియజేశారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకుంటూ ఐక్యత, సంతోషాలతో పండుగలను జరుపుకోవాలని ఆకాంక్షించారు.తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు ప్రతీక బతుకమ్మ మన సంస్కృతికి గర్వకారణం బతుకమ్మ ఈ యొక్క కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ సుర్ణపు సోమయ్య, మున్సిపల్ కమిషనర్ యం .వినోద్ కుమార్, కలెక్టరేట్ సంబంధిత అధికారులు, మున్సిపల్ శాఖ అధికారులు, రెవెన్యూ శాఖ అధికారులు, పట్టణ 36 వార్డుల కౌన్సిలర్లు, ఏఎంసి వైస్ చైర్మన్, మహిళా మణులు కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు పట్టణ నాయకులు కార్యకర్తలు ఎన్ యస్ యు ఐ జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా సద్దుల బతుకమ్మ వేడుకలు

- రంగురంగుల పూలతో బతుకమ్మల అలంకరణ

నర్సంపేట,అక్టోబర్:18 (తరంగాలు ప్రతినిధి)
తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే సద్దుల బతుకమ్మ వేడుకలు ఖానాపురం గ్రామంలో ఘనంగా నిర్వహించారు. తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతి ఆరాధనకు, సాంస్కృతిక వైభవానికి ప్రతీకగా నిలిచే ఈ పూల పండుగను మహిళలు, యువతులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. రంగురంగుల పూలతో అందంగా బతుకమ్మ లను పేర్చి, సంప్రదాయ దుస్తులు ధరించి వేడుకల్లో పాల్గొన్నారు. మహిళలు ఉదయం నుంచే బతుకమ్మల తయారీలో నిమగ్నమయ్యారు. తంగేడు, గునుగు, బంతి, చామంతి తదితర రంగురంగుల పూలను సేకరించి వాటిని వరుసలుగా పేర్చి అందమైన బతుకమ్మలను సిద్ధం చేశారు. సాయంత్రం వేళ మహిళలు, యువతులు తమ బతుకమ్మలతో నిర్ణీత ప్రదేశాలకు చేరుకుని ఒకచోట చేరి ఆటపాటలతో గడిపారు మహిళలు బతుకమ్మల చుట్టూ చేరి సంప్రదాయ బతుకమ్మ పాటలు పాడుతూ, చప్పట్లు కొడుతూ ఉత్సాహంగా ఆడిపాడారు. తరతరాలుగా వస్తున్న జానపద గేయాలను ఆలపిస్తూ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను చాటిచెప్పారు. చిన్నారుల నుంచి వృద్ధ మహిళల వరకు వేడుకల్లో పాల్గొనడంతో పండుగ వాతావరణం నెలకొంది. బతుకమ్మ వేడుకలు మహిళల మధ్య ఆత్మీయతను పెంపొందించడంతో పాటు కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు ఒకచోట చేరేందుకు



వేదికగా నిలిచాయి. పుట్టింటి ఆడపడుచులు తమ కుటుంబాలతో కలిసి పండుగను జరుపుకోవడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ప్రకృతి ఆరాధనకు ప్రతీకగా బతుకమ్మ పండుగ తెలంగాణ ప్రజల జీవన విధానంతో ముడిపడిన ప్రత్యేకమైన పూల పండుగ. ప్రకృతిలో లభించే వివిధ రకాల పూలను పూజించడం ద్వారా ప్రకృతి ప్రాధాన్యతను చాటిచెప్పే ఈ పండుగకు రాష్ట్రవ్యాప్తంగా విశేష ఆదరణ ఉంది. తొమ్మిది రోజులపాటు వివిధ రూపాల్లో బతుకమ్మలను పూజించి, చివరి రోజున సద్దుల బతుకమ్మను ఘనంగా నిర్వహించడం ఆనవాయితీ. సద్దుల బతుకమ్మ సందర్భంగా మహిళలు ఐదు రకాల సద్దులను నైవేద్యంగా సమర్పించడం సంప్రదాయం. ప్రాంతీయ ఆచారాలను అనుసరించి నైవేద్యాలు సిద్ధం చేసి గౌరమ్మకు పూజలు నిర్వహిస్తారు. అనంతరం బతుకమ్మలకు హారతులు ఇచ్చి, కుటుంబ సభ్యుల సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, పాడిపంటలు సమృద్ధిగా ఉండాలని అమ్మవారిని ప్రార్థిస్తారు.తెలంగాణ సంస్కృతికి ప్రతిబింబం తెలంగాణ ప్రత్యేకతను ప్రపంచానికి చాటిచెప్పే పండుగల్లో బతుకమ్మకు విశిష్ట స్థానం ఉంది. కులమతాలకు అతీతంగా మహిళలందరూ ఒకచోట చేరి జరుపుకునే ఈ వేడుకలు సామాజిక ఐక్యతకు ప్రతీకగా నిలుస్తాయి. పూలను పూజించే సంప్రదాయం ప్రకృతి పరిరక్షణ ప్రాధాన్యతను కూడా గుర్తుచేస్తుంది. తెలంగాణ సంప్రదాయాలను భావితరాలకు అందించడంలో బతుకమ్మ వేడుకలు కీలక పాత్ర పోషిస్తున్నాయని పలువురు పేర్కొన్నారు.

# ఆర్ అండ్ బి ఏఈ అండ..

- జోరుగా మట్టి దందా
- కూసుమంచి మండలం నుంచి
- ఖమ్మం రూరల్ మండలానికి తరలింపు..
- ఏఈ పృథ్వీరాజ్ అండదండలతో అక్రమ రవాణా..
- మట్టి తరలింపు పై సమాచారం ఇస్తే
- అయితే ఏంటి..? అంటున్న ఆర్ అండ్ బి ఏఈ
- మట్టి మాఫియా కు కొమ్ము కాస్తున్న ఏఈ పై
- తక్షణమే చర్యలు తీసుకోవాలంటున్న మండల ప్రజలు..

**పాలేరు ఆర్సీ, అక్టోబర్ 18 (తరంగాలు ) :**
కూసుమంచి మండలం పాలేరు గ్రామంలో నిర్వహించబడుతున్న నాలుగు వరుసల రహదారి పనుల లో భాగంగా నిర్మిస్తున్న సైడ్ డ్రెయిన్ పనుల నిర్వహణలో ఏఈ పృథ్వీరాజ్ ఇష్టరాజ్యంగా వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. సైడ్ డ్రెన్ నిర్మాణ పనుల్లో భాగంగా జరుగుతున్న తవ్వకాల్లో బయటపడుతున్న మట్టిని అక్రమార్కులు ఇష్టారాజ్యంగ తరలిస్తున్న ఏఈ చూసి చూడనట్లు వ్యవహరిస్తుండటం పలు అనుమానాలకు తావిస్తోంది. కాలువ నిర్మాణ పనుల్లో భాగంగా జరుపుతున్న తవ్వకాల్లో బయటపడుతున్న మట్టిని స్థానిక అవసరాల కోసం అక్కడే నిల్వ



చేసుకోవాల్సిన అవసరం ఉన్నా కూడా ఏఈ సంబంధిత గుత్తేదారుతో కుమ్మక్కై ఖమ్మం రూరల్ మండలం తెల్దార్ పల్లి కి మట్టి తరలిస్తున్న కూడా తనకేమీ సంబంధం లేనట్లు వ్యవహరిస్తుండటం చర్చనీయాంశంగా మారింది.

**ఆదివారం అదను చూసి అక్రమ రవాణా..**

ఈ మట్టి దందాకు రహదారులు భవనాల నిర్మాణ విభాగం ఏఈ పృథ్వీరాజ్ పరోక్షంగా సహకరిస్తున్నట్లు ప్రత్యక్షంగా తెలుస్తోంది. ఆదివారం రోజు అతను చూసి మరి ఈ అక్రమ రవాణా జరగడం అధికారుల సలహాలు సూచనలతోనే అక్రమార్కులు ఈ విధానంగా మట్టి తరలిస్తున్నారు అనే ఆరోపణలు తేటతెలమవుతున్నాయి. ఆదివారం సెలవు దినాలలో సంబంధిత సిబ్బంది సెలవులో ఉంటారని ఎవరైనా ఫిర్యాదు లేదా ఫోన్ చేసిన స్పందించడం ఆలస్యం అవుతుంది ఈ లోపల అక్రమార్కుల అవసరాలు కూడా తీరతాయని అధికారులే స్వయంగా సలహాలిస్తున్నట్లు వినికిడి.

**తక్షణమే చర్యలు తీసుకోవాలి..**

రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రత్యేక దృష్టితో నిధులు నియోజకవర్గానికి తీసుకొచ్చి అభివృద్ధి పరుగులు పెట్టిస్తుంటే అధికారుల తీరు అసహనానికి గురిచేస్తుంది. గుత్తేదారుకి కొమ్ము కాశి అక్రమంగా మట్టి తరలిస్తున్న పట్టించుకోకపోవడం పట్ల కలెక్టర్ తక్షణమే విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

అవును.. తరలిస్తే తప్పేంటి...?
ఆర్ అండ్ బి ఏఈ పృథ్వీరాజ్ సమాధానం..

పాలేరు నుండి ఖమ్మం రూరల్ మండలానికి టిప్పర్ల ద్వారా అక్రమంగా మట్టి తరలిస్తున్నారని సంబంధిత రహదారులు భవనాల శాఖ అధికారి ఏఈ పృథ్వీరాజ్ కు ఫోన్ ద్వారా ప్రభాతవార్త ప్రతినిధి సమాచారం అందించగా.. అవును మట్టి తరలిస్తే తప్పేంటి..? అక్కడ అదనంగా ఉంది కాబట్టే తరలిస్తున్నారు. అయినా మట్టి తోలుకుంటే మీకెందుకు అబ్బా.. నేను బండి మీద ఉన్నా...అంటూ నిర్లక్ష్యంగా ఫోన్ పెట్టేశారు.

# ఘనంగా సద్దుల బతుకమ్మ వేడుకలు

- రంగురంగుల పూలతో బతుకమ్మల అలంకరణ

**యాదాద్రి భువనగిరి జిల్లా అక్టోబర్ 18 తరంగాలు**
మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో ఆదివారంతెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే సద్దుల బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు,ప్రకృతి ఆరాధనకు,సాంస్కృతిక వైభవానికి ప్రతీకగా నిలిచే ఈ పూల పండుగను మహిళలు,యువతులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. రంగురంగుల పూలతో అందంగా బతుకమ్మ లను పేర్చి,సంప్రదాయ దుస్తులు ధరించి వేడుకల్లో పాల్గొన్నారు. మహిళలు ఉదయం నుంచే బతుకమ్మల తయారీలో నిమగ్నమయ్యారు. తంగేడు,గునుగు,బంతి, చామంతి తదితర రంగురంగుల పూలను సేకరించి వాటిని వరుసలుగా పేర్చి అందమైన బతుకమ్మలను సిద్ధం చేశారు.సాయంత్రం వేళ మహిళలు, యువతులు తమ బతుకమ్మలతో నిర్ణీత ప్రదేశాలకు చేరుకుని ఒకచోట చేరి ఆటపాటలతో గడిపారు.మహిళలు బతుకమ్మల చుట్టూ చేరి సంప్రదాయ బతుకమ్మ పాటలు పాడుతూ,చప్పట్లు కొడుతూ ఉత్సాహంగా ఆడిపాడారు. తరతరాలుగా వస్తున్న జానపద గేయాలను ఆలపిస్తూ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను చాటిచెప్పారు.చిన్నారుల నుంచి వృద్ధ మహిళల వరకు వేడుకల్లో పాల్గొనడంతో పండుగ వాతావరణం నెలకొంది. బతుకమ్మ వేడుకలు మహిళల మధ్య ఆత్మీయతను పెంపొందించడంతో పాటు కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు ఒకచోట చేరేందుకు వేదికగా నిలిచాయి. పుట్టింటి ఆడపడుచులు తమ కుటుంబాలతో కలిసి పండుగను జరుపుకోవడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ప్రకృతి ఆరాధనకు ప్రతీకగా



బతుకమ్మ పండుగ తెలంగాణ ప్రజల జీవన విధానంతో ముడిపడిన ప్రత్యేకమైన పూల పండుగ.ప్రకృతిలో లభించే వివిధ రకాల పూలను పూజించడం ద్వారా ప్రకృతి ప్రాధాన్యతను చాటిచెప్పే ఈ పండుగకు రాష్ట్రవ్యాప్తంగా విశేష ఆదరణ ఉంది.తొమ్మిది రోజులపాటు వివిధ రూపాల్లో బతుకమ్మలను పూజించి,చివరి రోజున సద్దుల బతుకమ్మను ఘనంగా నిర్వహించడం ఆనవాయితీ.సద్దుల బతుకమ్మ సందర్భంగా మహిళలు ఐదు రకాల సద్దులను నైవేద్యంగా సమర్పించడం సంప్రదాయం.ప్రాంతీయ ఆచారాలను అనుసరించి నైవేద్యాలు సిద్ధం చేసి గౌరమ్మకు పూజలు నిర్వహిస్తారు.అనంతరం బతుకమ్మలకు హారతులు ఇచ్చి,కుటుంబ సభ్యుల సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, పాడిపంటలు సమృద్ధిగా ఉండాలని అమ్మవారిని ప్రార్థిస్తారు.తెలంగాణ సంస్కృతికి ప్రతిబింబం తెలంగాణ ప్రత్యేకతను ప్రపంచానికి చాటిచెప్పే పండుగల్లో బతుకమ్మకు విశిష్ట స్థానం ఉంది. కులమతాలకు అతీతంగా మహిళలందరూ ఒకచోట చేరి జరుపుకునే ఈ వేడుకలు సామాజిక ఐక్యతకు ప్రతీకగా నిలుస్తాయి.పూలను పూజించే సంప్రదాయం ప్రకృతి పరిరక్షణ ప్రాధాన్యతను కూడా గుర్తుచేస్తుంది.తెలంగాణ సంప్రదాయాలను భావితరాలకు అందించడంలో బతుకమ్మ వేడుకలు కీలక పాత్ర పోషిస్తున్నాయని పలువురు పేర్కొన్నారు.

జాతీయ దిన పత్రిక
తరంగాలు
THARANGALU DAILY NEWS
సోమవారం, 19 అక్టోబర్ , 2026


# తుంబూరు దయాకర్ రెడ్డికి సమస్యలతో కూడిన వినతిపత్రం సమర్పణ

- ఉపాధ్యాయ పెన్షనర్స్ అసోసియేషన్ బాధ్యులు



**తరంగాలు ఖమ్మం జిల్లా బ్యూరో :** ఎదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని కాలనీలలో నెలకొన్న సమస్యలపై రాష్ట్ర రెవెన్యూ గృహ నిర్మాణ సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి క్యాంప్ కార్యాలయం ఇంచార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డి కి వినతిపత్రం అందించిన ఎదులాపురం ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు ఎస్ విజయ్ ప్రధాన కార్యదర్శి ఎర్రమళ్ళ శ్రీనివాసరావు కమిటీ బాధ్యులు ఏదులాపురం మున్సిపాలిటీలో వివిధ కాలనీలలో మంజూరైన సీసీ రోడ్లను డ్రైనేజీల పనుల ను వెంటనే ప్రారంభించాలని అలాగే టీచర్స్ కాలనీ నుండి లక్ష్మీ బృందావనం కాలనీ కి వెళ్లే రోడ్డు చింతచెట్టు బజార్ లో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి వీధిలైట్లను ఏర్పాటు చేయాలని కాలనీలలో అసంపూర్తిగా వదిలేసిన మిషన్ భగీరథ పైపు లైన్ ను పూర్తి చేయాలని పైపులైన్ వేయని కాలనీలలో పైపులైన్ వేసి మంచినీటిని అందించాలని కుక్కల కోతుల బెడదను నివారించాలని జలగం నగర్ నుండి వరంగల్ క్రాస్ రోడ్ వరకు సెంట్రల్ లైటింగ్ పనులను ప్రారంభించాలని కోదాడ క్రాస్ రోడ్ నుండి వరంగల్ క్రాస్ రోడ్ వరకు రోడ్డు విస్తరణ పనులను వెంటనే చేపట్టాలని వివిధ కాలనీలలో వీధిలైట్లను ఏర్పాటు చేయాలని రైతు బజార్లను వాకింగ్ ట్రాకులను ఏర్పాటు చేయాలని తదితర సమస్యలతో కూడిన వినతి పత్రం అందజేయడం జరిగింది అనంతరం మంత్రి క్యాంపు కార్యాలయం ఇంచార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డి మాట్లాడుతూ కోదాడ క్రాస్ రోడ్ నుండి వరంగల్ క్రాస్ రోడ్ వరకు రోడ్డు విస్తరణ పనులు టెండర్లు పూర్తి అయినాయని ఈ వారంలోనే పనులు ప్రారంభిస్తారని అలాగే మున్సిపాలిటీ నిధులనుండి రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి నిధుల నుండి మంజూరైన పనులు టెండర్లు పూర్తయి పనులు ప్రారంభించడానికి తయారుగా ఉన్నాయని ఈ వారంలోనే వాటిని ప్రారంభించి రోడ్లు వేస్తారని అన్నారు. విద్యుత్ అధికారులతో వెంటనే మాట్లాడి విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేస్తానని అన్నారు. సమస్యలపై సానుకూలంగా స్పందించి వెంటనే విద్యుత్ అధికారులతో మాట్లాడినందుకు దయాకర్ రెడ్డి కి అసోసియేషన్ బాధ్యులు ధన్యవాదాలు తెలియజేశారు. పై విషయాలన్నింటిపై వివరంగా చర్చించి సానుకూలంగా స్పందించినందుకు అసోసియేషన్ నాయకులు జవ్వనబోయిన లింగయ్యకు మున్సిపాలిటీ బయోడైవర్సి కమిటీలో స్థానం కల్పించినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం దయాకర్ రెడ్డి కి పూల మొక్కను లింగయ్య అందించారు. ఈ కార్యక్రమంలో ఏదులాపురం ఉద్యోగ ఉపాధ్యాయ పె న్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు ఎస్. విజయ్, ప్రధాన కార్యదర్శి ఎర్రమళ్ళ, శ్రీనివాసరావు,గౌరవా సలహాదారుడు ఎన్.శంకర్, కోశాధికారి గంధసిరి.మల్లయ్య, సహాయ కార్యదర్శి యా దండ్ల. సాయిబాబా, వలబోయిన. వెంకటరమణ,మద్ది.పుల్లయ్య జవ్వన బోయిన.లింగయ్య, బి. రవి తదితరులు పాల్గొన్నారు.

# బాచుపల్లిలో అంబరాన్నంటిన సద్దుల బతుకమ్మ సంబరాలు

- ఆటపాటలతో హోరెత్తిన పోచమ్మ ఆలయ ప్రాంగణం
- ఆగం పాండు ముదిరాజ్ ఆధ్వర్యంలో వైభవంగా వేడుకలు..



**కుత్బుల్లాపూర్, అక్టోబర్ 18,( తరంగాలు )**
తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే సద్దుల బతుకమ్మ వేడుకలు బాచుపల్లిలో వైభవంగా జరిగాయి. బాచుపల్లిలోని పోచమ్మ ఆలయం వద్ద మహిళలు పెద్ద సంఖ్యలో ఉత్సాహంగా పాల్గొని పూల బతుకమ్మలను పేర్చి, సంప్రదాయ పాటలు, ఆటపాటలతో సందడి చేశారు. మహిళల కోలాహలం, బతుకమ్మ పాటలతో ఆలయ పరిసరాలు పండుగ శోభను సంతరించుకున్నాయి.బాచుపల్లి మాజీ సర్పంచ్, ఎన్ఎంసీ మాజీ కార్పొరేటర్ ఆగం పాండు ముదిరాజ్ ఆధ్వర్యంలో సద్దుల బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. సంప్రదాయాలకు పెద్దపీట వేస్తూ నిర్వహించిన ఈ వేడుకలు స్థానికంగా పండుగ వాతావరణాన్ని నింపాయి. రంగురంగుల పూలతో అలంకరించిన బతుకమ్మలు, మహిళల సందడి ఈ వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతి ఆరాధనకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను సంప్రదాయబద్ధంగా జరుపుకోవడంతో బాచుపల్లిలో పండుగ కళ ఉట్టిపడింది.

# ఘనంగా బతుకమ్మ విగ్రహ ఆవిష్కరణ

**•సంగెం, అక్టోబర్ 18 తరంగాలు**



సంగెం మండలం తిమ్మాపురం గ్రామంలో ఆదివారం బతుకమ్మ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ వేల్పుల రాజు--సునీత దంపతుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి స్థానిక ఎస్సై వంశీకృష్ణ ముఖ్య అతిథిగా హాజరై విగ్రహాన్ని ఆవిష్కరించారు.సర్పంచ్ వేల్పుల రాజు తన తండ్రి దివంగత ఐలయ్య, కుమారుడు బన్నీ జ్ఞాపకార్థం గ్రామానికి బతుకమ్మ విగ్రహాన్ని విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఎస్సై వంశీకృష్ణ మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అయిన బతుకమ్మ విగ్రహాన్ని గ్రామానికి అందించడం అభినందనీయమన్నారు. కుటుంబ సభ్యుల జ్ఞాపకార్థం సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాలు చేపట్టడం గొప్ప విషయమని సర్పంచ్ సేవాభావాన్ని కొనియాడారు.అనంతరం గ్రామ మహిళలు, ప్రజలు నూతన విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ కొలకనూరి స్వామి, మాజీ వైస్ ఎంపీపీ మల్లయ్య, మాజీ సొసైటీ చైర్మన్ వేల్పుల కుమారస్వామి, మాజీ సర్పంచ్ మాదినేని రామిరెడ్డి, వార్డు సభ్యులు మెంతుల శ్రీనివాసు, కొలకనూరి దివ్య, రాజు, పోశాల రాజేష్, స్రవంతి, కొలకనూరి రాజు, ఉడుత అనిల్ యాదవ్, గ్రామ పార్టీ అధ్యక్షుడు, స్థానిక నాయకులు గన్ను రమేష్, బండారి అశోక్, అడ్డగట్ల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# అంగరంగ వైభవంగా సద్దుల బతుకమ్మ ఉత్సవాలు



**సంగెం,అక్టోబర్18తరంగాలు**
మండలంలోని గొల్లపల్లి గ్రామంలో సర్పంచ్ కన్నబోయిన సంధ్య స్వామి ఆధ్వర్యంలో సద్దుల బతుకమ్మ ఉత్సవాలను అంగరంగ వైభవంగా ఘనంగా నిర్వహించారు. గ్రామంలో విద్యుత్ దీపాల కాంతుల మధ్య బతుకమ్మ వేడుకలు అంగరంగ వైభవంగా సాగాయి. మహిళలు సంప్రదాయ దుస్తులు ధరించి, రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి ఆటపాటలతో సంబరాలు జరుపుకున్నారు. గ్రామంలో పండుగ వాతావరణం నెలకొనగా, ప్రజలు ఉత్సాహంగా ఉత్సవాల్లో పాల్గొన్నారు.

# భద్రకాళి అమ్మవారిని దర్శించుకున్న ఎంపీ వద్దిరాజు రవిచంద్ర





- నవరాత్రి ఉత్సవాల్లో ప్రత్యేక పూజలు.. తొమ్మిది రోజుల పాటు పూలంగి సేవలు నిర్వహించిన రవిచంద్ర కుటుంబం

**వరంగల్ ప్రతినిధి , అక్టోబర్ 18, (తరంగాలు)**: ఓరుగల్లు ఇలవేల్పు శ్రీ భద్రకాళి అమ్మవారి శరన్నవరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ ఫ్లోర్ లీడర్, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర ఆదివారం అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనతో పాటు ప్రభుత్వ మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్, మాజీ ఎమ్మెల్యే నన్నపనేని నరేందర్ తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు.కాకతీయుల కాలం నాటి చారిత్రక భద్రకాళి దేవస్థానంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా దుర్గామాత అలంకరణలో భక్తులకు దర్శనమిస్తున్న అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చిన ఎంపీ వద్దిరాజు రవిచంద్రకు ఆలయ కమిటీ సభ్యులు, అధికారులు, వేద పండితులు మేళతాళాలు, పూర్ణకుంభంతో ఘనస్వాగతం పలికారు.

అనంతరం రవిచంద్రతో పాటు దాస్యం వినయ్ భాస్కర్, నన్నపనేని నరేందర్ తదితరులు తమ గోత్రనామాలతో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. పూజల అనంతరం ప్రధాన అర్చకులు శేష అయ్యగారు, వేద పండితులు నాగరాజు శర్మ, అరవింద్ శర్మ వారికి శాలువాలు కప్పి సత్కరించారు.



అమ్మవారి తీర్థప్రసాదాలను అందజేసి ఆశీర్వచనాలు పలికారు.

ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో, దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ రాయల సునీత, సూపరింటెండెంట్ కుచన హరినాథ్, మున్నూరు కాపు నాయకుడు కూసం శ్రీనివాస్, ఆలయ సిబ్బంది నాగులు, సందీప్, ప్రభాకర్‌తో పాటు విఆర్సీ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

### తొమ్మిది రోజుల పాటు అమ్మవారికి పూలంగి సేవలు

అమ్మవారి సేవలో భాగస్వామ్యం కావడం అదృష్టం: ఎంపీ వద్దిరాజు రవిచంద్ర

వరంగల్‌లోని చారిత్రక శ్రీ భద్రకాళి దేవస్థానంలో నిర్వహిస్తున్న దసరా శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా అమ్మవారికి తొమ్మిది రోజుల పాటు పూలంగి సేవలు నిర్వహించే అవకాశం తమ కుటుంబానికి లభించడం అదృష్టంగా భావిస్తున్నామని రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర తెలిపారు.నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా తొమ్మిది రోజుల పాటు ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం శ్రీ భద్రకాళి అమ్మవారితో పాటు అమ్మవారి శేష వాహనాలను వివిధ రకాల పుష్పాలు, గజమాలలతో అలంకరించి పూలంగి సేవలు నిర్వహించినట్లు ఆయన వెల్లడించారు. రంగురంగుల పుష్పాలతో అమ్మవారిని, వాహనాలను సర్వాంగసుందరంగా అలంకరించి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించినట్లు పేర్కొన్నారు.ఈ పవిత్రమైన సేవలో భాగస్వాములయ్యే అవకాశాన్ని తమ కుటుంబానికి కల్పించిన శ్రీ భద్రకాళి అమ్మవారికి ఎంపీ వద్దిరాజు రవిచంద్ర కృతజ్ఞతలు తెలిపారు. అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు.

జాతీయ దిన పత్రిక
తరంగాలు

# సర్పంచ్ బత్తిని దశరథం ఆధ్వర్యంలో ఘనంగా బతుకమ్మ సంబరాలు





**జఫార్గడ్ ప్రతినిధి,అక్టోబర్ 18, (తరంగాలు) :** మండలంలోని బండౌతపురం గ్రామంలో సర్పంచ్ బత్తిని దశరథం ఆధ్వర్యంలో తెలంగాణ సాంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను బండవతపురంలోని చెరువు కట్ట దగ్గర మహిళలందరూ ఘనంగా బతుకమ్మ సంబరాలు జరుపుకున్నారు ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో ఒకే చోట చేరి బతుకమ్మ పాటలు సాంప్రదాయ నృత్యాలతో పండుగ వాతావరణం నెలకొల్పారు బతుకమ్మ పండుగలు తొలిరోజైనా ఎంగిలిపూల బతుకమ్మ సందర్భంగా మహిళలు వివిధ రకాల రంగురంగుల పూలతో బతుకమ్మ పేర్చి భక్తిశ్రద్ధలతో గౌరమ్మను పూజించారు అనంతరం బతుకమ్మ పాటలకు అనుగుణంగా సాంప్రదాయ నృత్యాలను చేస్తూ ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకుంటూ ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ సుకన్య అమరేందర్, వార్డు మెంబర్లు మారపల్లి వంశీ మరు పట్ల నిర్మల, మరుపట్ల మస్తాన్, మరు పట్ల సుప్రియ మరుపట్ల అజీమ్ ఎలా కంటి విజయ్ రజిత కళ్యాణి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు

# తల్లిదండ్రులను కోల్పోయిన ఇద్దరు కుమార్తెలకు అండగా సమ్మయ్య గౌడ్





- దశదిన ఖర్మకు ఆర్థిక సాయం.. ఇంటిపై తాటిపత్రి కప్పించి, బియ్యం అందజేత
- కష్టాల్లో ఉన్న పేద కుటుంబాలకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుంది: మండల అధ్యక్షుడు సమ్మయ్య గౌడ్

**కేసముద్రం, అక్టోబర్ 1, (తరంగాలు ప్రతినిధి):** మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం వెంకటగిరి గ్రామానికి చెందిన జనగాం కవిత అనారోగ్య కారణాలతో అక్టోబర్ 17న మృతి చెందారు. గతంలో ఆమె భర్త యాకయ్య మరణించగా, తాజాగా తల్లి కూడా మృతి చెందడంతో వారి ఇద్దరు కుమార్తెలు తల్లిదండ్రులను కోల్పోయి దిక్కుతోచని స్థితిలో పడ్డారు.కుటుంబం తీవ్ర పేదరికంలో ఉండటంతో తల్లి దశదిన ఖర్మ నిర్వహించేందుకు కూడా ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్నాయని గ్రామ మాజీ సర్పంచ్ యాకన్న యాదవ్, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మద్రి వెంకట్రావు.. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చిలువేరు సమ్మయ్య గౌడ్ దృష్టికి తీసుకెళ్లారు.

విషయం తెలుసుకున్న సమ్మయ్య గౌడ్ వెంటనే స్పందించి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కుటుంబ పరిస్థితిని, నివాస గృహం దుస్థితిని స్వయంగా పరిశీలించారు. ఇల్లు సరిగా లేకపోవడంతో ఇంటిపై తాటిపత్రి కప్పించే ఏర్పాట్లు చేయించారు. అలాగే దశదిన ఖర్మ నిర్వహణకు ఉపయోగపడేలా అర క్వింటా బియ్యంతో పాటు ఆర్థిక సహాయం అందజేశారు.

**చదువును కొనసాగించాలి.. అండగా ఉంటా**

ఈ సందర్భంగా కుమార్తెతో మాట్లాడిన సమ్మయ్య గౌడ్, కష్టాలు ఎదురయ్యాయని చదువును మధ్యలోనే ఆపవద్దని సూచించారు. భవిష్యత్తులోనూ తన వంతు సహాయం అందిస్తానని భరోసా కల్పించారు. పెద్ద కుమార్తెకు ఇప్పటికే వివాహం కాగా, చిన్న కుమార్తె భవిష్యత్తులో వివాహం చేసుకునే సమయంలోనూ తనవంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. తల్లిదండ్రులను కోల్పోయిన ఆడబిడ్డలు ఒంటరివారమనే భావనకు లోనుకాకుండా ధైర్యంగా ఉండాలని సూచించారు.ఆపదలో ఉన్న కుటుంబానికి తక్షణ సహాయం అందించడంతో పాటు, బాలిక చదువు, భవిష్యత్తుపై బాధ్యతతో స్పందించిన సమ్మయ్య గౌడ్‌ను గ్రామస్థులు అభినందించారు. సమాచారం అందిన వెంటనే స్పందించి, కుటుంబానికి అండగా నిలిచినందుకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా సమ్మయ్య గౌడ్ మాట్లాడుతూ.. బలహీన వర్గాలకు, ఆపదలో ఉన్న పేద కుటుంబాలకు మండల కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్న వారికి సాధ్యమైనంత సహాయం అందించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో వెంకటగిరి గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మద్రి వెంకట్రావు, మాజీ సర్పంచ్ సుజాత యాకన్న, మాజీ ప్రజాప్రతినిధి మారం మోహన్ రెడ్డి, యూత్ అధ్యక్షుడు పోల్సాని విక్రమ్, ఇంటికన్నె గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాజులపాటి మల్లయ్య, ఇంటికన్నె యూత్ అధ్యక్షుడు వర్ధంతి రంజిత్, కాంగ్రెస్ పార్టీ యువకులు జగదీష్, బానోతు అమిలాల్, అంబాల శరత్, జనగాం సాయికుమార్, పందుల రాజు, మల్లూరి రాజు, అశోక్, సీనియర్ నాయకులు రాంపల్లి వెంకన్న, నల్లవాసప్పలయ్య, మిట్టకడుపుల యాకయ్య, కత్రి కిషన్ తదితరులు పాల్గొన్నారు.

# మహబూబాబాద్ ఆర్టీసీ డిపోలో టీజీ ఆర్టీసీ వర్కర్స్ యూనియన్ సంబరాలు



- క్లాస్-6 గుర్తింపు పొందడంతో కార్మికుల హర్షాతిరేకాలు.. బాణసంచా కాల్చి, మిఠాయిల పంపిణీ

మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 18(తరంగాలు మహబూబాబాద్ జిల్లా తెలంగాణ ఆర్టీసీ వర్కర్స్ యూనియన్‌కు వరంగల్ రీజియన్ పరిధిలో క్లాస్-6 గుర్తింపు లభించిన సందర్భంగా మహబూబాబాద్ ఆర్టీసీ డిపోలో కార్మికులు సంబరాలు జరుపుకున్నారు. శనివారం (అక్టోబర్ 17, 2026) రాష్ట్ర లేబర్ కమిషనర్ ప్రకటించిన తుది ఫలితాల్లో యూనియన్‌కు గుర్తింపు లభించడంతో ఆదివారం డిపోలో బాణసంచా కాల్చి, మిఠాయిలు పంచుకొని తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. వరంగల్ రీజియన్ పరిధిలోని మహబూబాబాద్, తొర్రూరు, నర్సంపేట, భూపాలపల్లి, వరంగల్-1, వరంగల్-2 డిపోల్లో విజయాలు సాధించిన తెలంగాణ ఆర్టీసీ వర్కర్స్ యూనియన్ తాజాగా క్లాస్-6 గుర్తింపు కూడా పొందడంతో కార్మికుల్లో ఉత్సాహం నెలకొంది. ఈ సందర్భంగా నిర్వహించిన గేట్ మీటింగ్‌కు మహబూబాబాద్ డిపో టీజీడబ్ల్యూయూ కన్వీనర్ కొలిపాక మల్లయ్య అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పట్టాభి లక్ష్మయ్య మాట్లాడుతూ. ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారానికి తెలంగాణ ఆర్టీసీ వర్కర్స్ యూనియన్, స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ నిరంతరం కృషి చేస్తున్నాయని తెలిపారు. మహబూబాబాద్ డిపో కార్మికుల కృషి, పట్టుదల కారణంగానే క్లాస్-6 గుర్తింపు సాధ్యమైందని పేర్కొంటూ, ఎన్నికల కోసం శ్రమించిన ప్రతి కార్మికుడికి కృతజ్ఞతలు తెలిపారు. కార్మిక సమస్యల పరిష్కారంలో యూనియన్ నాయకులు ముందుండాలని, కార్మికులకు మరియు యాజమాన్యానికి మధ్య వారధిగా నిలిచి సమస్యలను పరిష్కరించాలని ఆయన సూచించారు. అదే సమయంలో ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంలోనూ కార్మికులు కీలక పాత్ర పోషించాలని కోరారు. డిపోలో బస్సుల సంఖ్యను పెంచి ప్రయాణికులకు మరిన్ని సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేయాలని, కార్మికుల సమస్యల పరిష్కారం కోసం భవిష్యత్తులో చేపట్టే ఉద్యమాల్లో ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. మొగుళ్ల రాజిరెడ్డి, అశ్వత్థామ రెడ్డి నాయకత్వానికి మంచి పేరు తీసుకువచ్చేలా కార్మికులంతా కృషి చేయాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డిపో నాయకులు షబ్బీర్, అనిల్, ఖలీల్, రమేష్, రాజేశ్వరరావు, ఆళ్వార్, రవీందర్ రెడ్డి, పాపిరెడ్డి, నరేష్, యశ్వంత్, వేలాద్రి, మధుసూదన్, శంకర్, శ్రీనివాస్, కృష్ణ, వెంకటేశ్వర్లు, సలీం తదితరులు పాల్గొన్నారు.

## పెరికసింగారంలో 60 అడుగుల భారీ బతుకమ్మ

- 25 ఏళ్లుగా సంప్రదాయాన్ని కొనసాగిస్తున్న జూకూరి దంపతులు
- గతేడాది 55 అడుగులు.. ఈ ఏడాది 60 అడుగుల బతుకమ్మ
- భారీ బతుకమ్మ కోసం సుమారు 4 క్వింటాళ్ల పూల వినియోగం



**పాలేరు ఆర్సి, అక్టోబర్ 18 (తరంగాలు ) :** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం పెరికసింగారం గ్రామంలో వినూత్న రీతిలో జరుపుకుంటున్నారు. గ్రామానికి చెందిన జూకూరి గోపాల్ రావు, విజయలక్ష్మి దంపతులు ఏకంగా 60 అడుగుల ఎత్తైన భారీ బతుకమ్మను పేర్చి ప్రత్యేక ఆకర్షణగా నిలిపారు.గత 25 ఏళ్లుగా బతుకమ్మ పండుగ సందర్భంగా భారీ బతుకమ్మలను పేర్చడం ఈ దంపతులు ఆనవాయితీగా కొనసాగిస్తున్నారు. ప్రతి సంవత్సరం ప్రత్యేకత చాటుకునేలా భారీ బతుకమ్మలను రూపొందిస్తున్న వీరు, గత ఏడాది 55 అడుగుల ఎత్తైన బతుకమ్మను పేర్చగా, ఈ ఏడాది మరో ఐదు అడుగులు పెంచి 60 అడుగుల ఎత్తులో తీర్చిదిద్దారు.ఈ భారీ బతుకమ్మను రూపొందించేందుకు సుమారు నాలుగు క్వింటాళ్ల పూలను సేకరించి వినియోగించినట్లు నిర్వాహకులు చెబుతున్నారు. వివిధ రంగుల పూలతో అందంగా పేర్చిన ఈ బతుకమ్మ పండుగ శోభను మరింత పెంచుతోంది.తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి, ప్రకృతి ఆరాధనకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ విశిష్టతను చాటిచెప్పేలా జూకూరి దంపతులు పాతికేళ్లుగా ఈ సంప్రదాయాన్ని కొనసాగిస్తున్నారు. ఏటా భారీ బతుకమ్మను పేర్చుతూ తెలంగాణ సంస్కృతిని, పండుగ ప్రాధాన్యతను భావితరాలకు పరిచయం చేసేందుకు తమవంతు కృషి చేస్తున్నారు.పాతికేళ్ల ఆనవాయితీ.. నాలుగు క్వింటాళ్ల పూలతో 60 అడుగుల భారీ బతుకమ్మ.. పెరికసింగారం గ్రామంలో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది.

## కూసుమంచి ఎస్సైను కలిసిన కొమ్ము ప్రసాద్



**పాలేరు ఆర్సి, అక్టోబర్ 18 ( తరంగాలు ) :** కూసుమంచి మండల ఎస్సైగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన సతీష్ ను ప్రముఖ అంబేద్కర్ వాది దళిత నాయకుడు కొమ్ము ప్రసాద్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఆదివారం ప్రసాద్ ఎస్సై ను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ కూసుమంచి మండలం చాలా ప్రశాంతమైన మండలంగా ప్రసిద్ధిగాంచిందని అన్నారు. మండలంలో ఒకటి రెండు మినహా సమస్య ఆత్మక గ్రామాలు ఉండవని సమస్యలు సామరస్యంగా పరిష్కరించగలిగే విధంగా ఉంటాయని తెలిపారు. ప్రజలందరికీ బాధ్యతాయుతమైన సేవలు అందించి మనలను పొందాలని సూచించారు. డ్రగ్స్ గంజాయి రావణ పట్ల యువతను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేసి వాటి బారిన పడకుండా కాపాడాలని సూచించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ విధి నిర్వహణలో ప్రతి ఒక్కరి సలహాలు, సూచనలు తీసుకుంటూ ముందుకు వెళ్తానని తెలిపినట్లు ప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో నాతోటి పత్రికా విలేకరులు, దళిత నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## నూతన గృహప్రవేశ వేడుకలో పాల్గొని శుభాకాంక్షలు తెలిపిన సీపీఐ ఫ్లోర్ లీడర్ అజయ్ సారథి రెడ్డి

**మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 18(తరంగాలు ):**



మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని కవిత కాలనీలో అల్లి నాగమల్లు నూతన గృహప్రవేశం సందర్భంగా సీపీఐ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి. అజయ్ సారథి రెడ్డి వారి నివాసానికి వెళ్లి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నూతన గృహ యజమాని అల్లి నాగమల్లు సంతోషం వ్యక్తం చేస్తూ సీపీఐ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి. అజయ్ సారథి రెడ్డి,18వ వార్డు కౌన్సిలర్ రేషపల్లి నవీన్‌లను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కొమ్ము యాకయ్య తదితరులు పాల్గొన్నారు.

# దుర్గాష్టమి సందర్భంగా భద్రకాళి అమ్మవారికి విశేష పూజలు





- భద్రకాళి ఆలయంలో వైభవంగా బతుకమ్మ వేడుకలు.. వేలాదిగా తరలివచ్చిన మహిళలు

**వరంగల్, అక్టోబర్ 18 (తరంగాలు):** వరంగల్ మహానగరంలోని చారిత్రక శ్రీ భద్రకాళి దేవస్థానంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ఎనిమిదో రోజుకు చేరుకున్నాయి. దుర్గాష్టమి సందర్భంగా ఆదివారం అమ్మవారిని శ్రీ దుర్గాదేవి అలంకారంలో ముస్తాబు చేసి విశేష పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున 4 గంటలకు నిత్యాహ్నికం అనంతరం అర్చకులు పూజా కార్యక్రమాలు చేపట్టారు. ఉదయం భద్రపీఠ సేవ, సాయంత్రం అశ్వవాహన సేవలను వైభవంగా నిర్వహించారు.

### దుర్గాష్టమి విశిష్టత.. భద్రకాళి అవతార మహిమ

దుర్గాష్టమి రోజున భద్రకాళి అమ్మవారి జన్మోత్సవాన్ని పురస్కరించుకుని రాత్రి కూడా విశేష అభిషేకాలు, అర్చనలు, జపహోమాది కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. దేవీ భాగవతంలోని తృతీయ స్కంధం 27వ అధ్యాయం 9వ శ్లోకాన్ని అనుసరించి, మహాష్టమి రోజున దుర్గాదేవి కోటి యోగినీ గణాలతో భద్రకాళిగా ఆవిర్భవించిందని ఆలయ సంప్రదాయాలు తెలియజేస్తున్నాయి.
కాకతీయుల రాజధానిగా, ఏకశిలానగరంగా ప్రసిద్ధి చెందిన వరంగల్ నగరానికి భద్రకాళి అమ్మవారి ఆలయం ప్రత్యేక ఆధ్యాత్మిక ప్రాశస్త్యాన్ని చేకూర్చింది. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల్లో బతుకమ్మ పండుగకు భద్రకాళి ఆరాధనతో విడదీయలేని అనుబంధం ఉందని ఆలయ వర్గాలు వివరించాయి.

### భద్రమ్మే బతుకమ్మ.. తెలంగాణ సంస్కృతికి ప్రతీక

దుర్గాష్టమి సందర్భంగా మహిళలు అమ్మవారికి చద్దులు సమర్పించడం, బతుకమ్మను పేర్చి పూజించడం తెలంగాణలో తరతరాలుగా వస్తున్న సంప్రదాయమని ఆలయ అధికారులు పేర్కొన్నారు. భద్రమ్మ, బతుకమ్మ, భద్రేశ్వరి, భద్రకాళి పేర్లతో జగన్మాతను ఆరాధించే సంప్రదాయం తెలంగాణ ప్రజల ఆధ్యాత్మిక జీవనంలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుంది.
కాకతీయుల కాలం నుంచి కొనసాగుతున్న బతుకమ్మ వేడుకలు మహిళల భక్తి, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఆదివారం సాయంత్రం శ్రీ భద్రకాళి దేవస్థాన ప్రాంగణంలో వేలాదిమంది మహిళలు బతుకమ్మలను పేర్చి, ఆటపాటలతో సంబరాలు జరుపుకున్నారు. ఆలయ ప్రాంగణమంతా బతుకమ్మ సందడితో కళకళలాడింది.

### అమ్మవారిని దర్శించుకున్న ప్రముఖులు

దుర్గాష్టమి సందర్భంగా ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య శ్రీ భద్రకాళి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట ప్రముఖ వ్యాపారవేత్త, ఆలయ ఉభయదాత అప్పావారి లక్ష్మీనారాయణ తదితరులు ఉన్నారు.
అనంతరం రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర అమ్మవారిని దర్శించుకున్నారు. ఆయన వెంట మాజీ ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయభాస్కర్, మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ తదితరులు ఉన్నారు.ఆలయానికి విచ్చేసిన ప్రముఖులకు ధర్మకర్తలు కమటం వేణుగోపాల్, రమేష్ చంద్ భంగ్, కార్యనిర్వహణాధికారి రామల సునీత, అర్చకులు ఘనస్వాగతం పలికారు. ప్రత్యేక పూజల అనంతరం మహదాశీర్వచనం నిర్వహించి, అమ్మవారి శేషవస్త్రాలను బహూకరించి ప్రసాదాలను అందజేశారు.

### ఉభయదాతలుగా వ్యవహరించిన దంపతులు

దుర్గాష్టమి సందర్భంగా నిర్వహించిన పూజా కార్యక్రమాలకు భారతీ డిగ్రీ కళాశాల అధినేతలు ఇరుకుళ్ల సంజయ్ కుమార్--జయశ్రీ దంపతులు, డాక్టర్ పోతాని రాజేశ్వరప్రసాద్--డాక్టర్ లలితాదేవి దంపతులు ఉభయదాతలుగా వ్యవహరించారు.
శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, సేవలు కొనసాగుతున్నాయని ఆలయ కార్యనిర్వహణాధికారి రామల సునీత తెలిపారు.





# బతుకమ్మ వేడుకల్లో ఎమ్మెల్యే సందడి

**మహిళలతో కలిసి బతుకమ్మ ఆడిన ఎమ్మెల్యే**





వరంగల్ ప్రతినిధి, అక్టోబర్ 18,తరంగాలు : తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే సద్దుల బతుకమ్మ వేడుకల్లో వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు పాల్గొన్నారు. హసన్‌పర్తి మండల కేంద్రంతో పాటు గుంటూరుపల్లి, వంగపహాడ్, 56వ డివిజన్ గోపాలపూర్, 55వ డివిజన్ భీమారం, గుండ్లసింగారం ప్రాంతాల్లో నిర్వహించిన బతుకమ్మ సంబరాల్లో ఆయన పాల్గొని మహిళలతో కలిసి బతుకమ్మ ఆడారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, సాంస్కృతిక వైభవానికి ప్రతీక అని పేర్కొన్నారు. ప్రకృతిని పూజిస్తూ, రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి భక్తిశ్రద్ధలతో జరుపుకునే ఈ పండుగ తెలంగాణ ప్రత్యేకతను ప్రపంచానికి చాటిచెబుతుందని అన్నారు.

ఆయా ప్రాంతాల్లో మహిళలు సంప్రదాయ దుస్తులు ధరించి, అందంగా అలంకరించిన బతుకమ్మల చుట్టూ చేరి పాటలు పాడుతూ, కోలాటాలతో సందడి చేశారు. మహిళలతో కలిసి ఎమ్మెల్యే బతుకమ్మ సంబరాల్లో పాల్గొనడంతో పలు ప్రాంతాల్లో పండుగ వాతావరణం నెలకొంది.

ఈ సందర్భంగా మహిళలకు సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే.. ప్రతి ఇంటా సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, సిరిసంపదలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందిస్తూ బతుకమ్మ పండుగను ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలని పిలుపునిచ్చారు.



# కొలన్‌పల్లిలో బస్‌స్టాప్ కోసం గ్రామస్తుల ధర్నా

**బస్సు ఆపకపోవడంతో ఆందోళన.. అధికారులకు వినతిపత్రం**



రాయపర్తి, అక్టోబర్ 18,(తరంగాలు ప్రతినిధి): రాయపర్తి మండలం కొలన్‌పల్లి గ్రామంలో ఆర్టీసీ బస్‌స్టాప్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ గ్రామస్తులు బస్సు ముందు ధర్నా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ వంగాల ఎల్లమ్మ, ఉపసర్పంచ్ మునిగల శ్రీధర్ ఆధ్వర్యంలో గ్రామస్తులంతా ఏకమై తమ సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.మహబూబాబాద్ నుంచి ఉప్పల్‌కు వెళ్లే ఆర్టీసీ బస్సు రాయపర్తి, కొండూరు, కొలన్‌పల్లి గ్రామాల మీదుగా ప్రయాణిస్తున్నప్పటికీ, కొలన్‌పల్లిలో బస్సు నిలపడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో బస్సును నిలిపి డ్రైవర్, కండక్టర్‌ను ప్రశ్నించగా, గ్రామానికి అధికారికంగా బస్‌స్టాప్ కేటాయించలేదని, అందువల్ల బస్సు నిలపడం లేదని వారు తెలిపినట్లు గ్రామస్తులు పేర్కొన్నారు.ఈ సమస్యపై స్పందించిన సర్పంచ్ వంగాల ఎల్లమ్మ మహబూబాబాద్ ఆర్టీసీ డిపో మేనేజర్‌కు ఫోన్ చేసి గ్రామస్తులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించారు. దీనిపై స్పందించిన డిపో మేనేజర్ గ్రామంలో బస్‌స్టాప్ ఏర్పాటు చేయాలని కోరుతూ లిఖితపూర్వకంగా వినతిపత్రం సమర్పించాలని సూచించారు.దీంతో సర్పంచ్ వంగాల ఎల్లమ్మ, ఉపసర్పంచ్ మునిగల శ్రీధర్ ఆధ్వర్యంలో గ్రామస్తులు కొలన్‌పల్లిలో అధికారికంగా బస్‌స్టాప్ ఏర్పాటు చేయాలని కోరుతూ డిపో మేనేజర్‌కు వినతిపత్రం అందించేందుకు సిద్ధమయ్యారు.గ్రామంలో బస్సు నిలవకపోవడంతో విద్యార్థులు, ఉద్యోగులు, రైతులు, మహిళలు, వృద్ధులు రవాణా పరంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గ్రామస్తులు తెలిపారు. గ్రామం మీదుగా వెళ్లే ఆర్టీసీ బస్సును కొలన్‌పల్లిలోనూ నిలిపేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.కొలన్‌పల్లిలో అధికారిక బస్‌స్టాప్ ఏర్పాటు చేసి, ప్రయాణికుల సౌకర్యార్థం బస్సు నిలుపుదలకు అనుమతి కల్పించాలని గ్రామస్తులు ఆర్టీసీ అధికారులను విజ్ఞప్తి చేశారు. తమ రవాణా సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని కోరారు.

# కాంగ్రెస్ నేత సారయ్యకు ఎమ్మెల్యే నాగరాజు పరామర్శ



- సారయ్య ఆరోగ్యంపై ఆరా తీసిన ఎమ్మెల్యే
- వైద్యులను సంప్రదించి మెరుగైన చికిత్స అందించాలని సూచన..
- సారయ్య త్వరగా కోలుకోవాలని ఆకాంక్ష

**హనుమకొండ ప్రతినిధి, అక్టోబర్ 18,(తరంగాలు):** మాజీ కార్పొరేటర్ తూర్పటి సులోచన భర్త, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు సారయ్య గుండెపోటుకు గురై హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు హైదరాబాద్ నుంచి వెంటనే వచ్చి, హనుమకొండ జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కేఆర్ దిలీప్ రాజ్‌తో కలిసి ఆసుపత్రికి వెళ్లి సారయ్యను పరామర్శించారు.

ఈ సందర్భంగా సారయ్య ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఆయనకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరారు. సారయ్య త్వరగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి సాధారణ జీవితాన్ని కొనసాగించాలని ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ఆకాంక్షించారు.ఈ పరామర్శ కార్యక్రమంలో రాష్ట్ర లీగల్ సెల్ వైస్ చైర్మన్ నిమ్మాని శేఖర్ రావు,జేబీఎం హనుమకొండ జిల్లా అధ్యక్షులు జన్నపురెడ్డి రుక్వేద్ రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు సయ్యద్ ఇంతియాజ్, జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్ సిలువేరు శ్రీనివాస్, స్టాలిన్, శంకర్, రవి, కుమార్ రాజేష్, మహేష్, సుధీర్, జానీ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## శ్రీరామగిరిలో బతుకమ్మ తల్లి విగ్రహం ఆవిష్కరణ

- తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బతుకమ్మ పండుగ ప్రతీక ఎమ్మెల్యే డాక్టర్ భూక్యా మురళీ నాయక్



**మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 18 (తరంగాలు):**
మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం శ్రీరామగిరి గ్రామంలో బతుకమ్మ తల్లి విగ్రహాన్ని గ్రామ సర్పంచ్ మాదరి ప్రశాంత్ ఆధ్వర్యంలో మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ భూక్యా మురళీ నాయక్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని అన్నారు. ప్రకృతిని ఆరాధిస్తూ, మహిళల ఆత్మగౌరవాన్ని చాటిచెప్పే బతుకమ్మ పండుగకు తెలంగాణలో ప్రత్యేక స్థానం ఉందని పేర్కొన్నారు. శ్రీరామగిరి గ్రామంలో బతుకమ్మ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని తెలిపారు. ఇలాంటి కార్యక్రమాలు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించేందుకు దోహదపడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షురాలు భూక్యా ఉమా మురళీ నాయక్, మాజీ మండల అధ్యక్షుడు గొల్లపల్లి ప్రభాకర్, డీసీసీ మాజీ ఉపాధ్యక్షుడు బాలాజీ నాయక్, వివిధ గ్రామాల సర్పంచులు బాలకృష్ణ, దేవేందర్, ఇట్టే లీలా, నల్లగుట్ట తండా సర్పంచ్ శ్రీనివాస్, సుమన్, బెల్లి నరసయ్య, ధోనికాని మల్లయ్య, మద్దెల సమ్మయ్య, ఆవుల వెంకన్న తదితరులతో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు పాల్గొన్నారు.

## మహబూబాబాద్‌లో ఘనంగా సద్దుల బతుకమ్మ వేడుకలు

- ఎన్టీఆర్ స్టేడియంలో బతుకమ్మ సంబరాలు.. పాల్గొన్న ఎంపీ పోరిక బలరాం నాయక్, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, ఎమ్మెల్యే డాక్టర్ భూక్యా మురళీ నాయక్




**మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 18(తరంగాలు ):**
మహబూబాబాద్ జిల్లా తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే సద్దుల బతుకమ్మ పండుగ వేడుకలు మహబూబాబాద్ పట్టణంలోని ఎన్టీఆర్ స్టేడియంలో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో పార్లమెంట్ సభ్యుడు పోరిక బలరాం నాయక్, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ భూక్యా మురళీ నాయక్, మున్సిపల్ చైర్‌పర్సన్ జ్యోతి గుగులోతు పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజాప్రతినిధులు, కౌన్సిలర్లు, పట్టణ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని బతుకమ్మ సంబరాల్లో భాగస్వాములయ్యారు. తెలంగాణ ఆడపడుచులు రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, సంప్రదాయ పాటలు పాడుతూ సంబరాలు జరుపుకున్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల వైభవాన్ని చాటిచెప్పేలా వేడుకలు ఉత్సాహభరిత వాతావరణంలో సాగాయి.

## సద్దుల బతుకమ్మ వేడుకల్లో ఉపాధ్యాయురాలు మాడిశెట్టి మహేశ్వరికి అవార్డు ప్రదానం



**మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 18(తరంగాలు**
మహబూబాబాద్ జిల్లా సద్దుల బతుకమ్మ పండుగ సందర్భంగా నిర్వహించిన వేడుకల్లో 36వ వార్డుకు చెందిన ప్రముఖ ఉపాధ్యాయుడు మాడిశెట్టి సూర్యప్రకాష్ సతీమణి, ప్రముఖ ఉపాధ్యాయురాలు మాడిశెట్టి మహేశ్వరి అవార్డును అందుకున్నారు. మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ బి. మురళి నాయక్, సీపీఐ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి. అజయ్ సారధి రెడ్డి చేతుల మీదుగా ఆమె ఈ అవార్డును స్వీకరించారు. ఈ కార్యక్రమంలో 18వ వార్డు కౌన్సిలర్ రేషపల్లి నవీన్ పాల్గొన్నారు. సద్దుల బతుకమ్మ వేడుకల్లో భాగంగా మహేశ్వరికి అవార్డు అందజేయడం విశేషంగా నిలిచింది.

# మహబూబాబాద్‌లో ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక కోర్టు ఏర్పాటు చేయాలి

- జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాతోత్ హుస్సేన్ నాయక్‌కు బార్ అసోసియేషన్ వినతి



మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 18(తరంగాలు మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో ఎస్సీ, ఎస్టీ (అట్రాసిటీ నిరోధక చట్టం) కేసుల విచారణ కోసం ప్రత్యేక కోర్టును ఏర్పాటు చేయాలని కోరుతూ మహబూబాబాద్ బార్ అసోసియేషన్ ప్రతినిధులు జాతీయ షెడ్యూల్డ్ తెగల కమిషన్ (ఎన్‌సీ,ఎస్‌టీ) సభ్యుడు జాతోత్ హుస్సేన్ నాయక్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఆదివారం మచ్చర్లలోని ఆయన నివాసంలో ఈ వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ నాయకులు, సీనియర్ న్యాయవాదులు జిల్లాలో ప్రత్యేక ఎస్సీ, ఎస్టీ కోర్టు ఏర్పాటుకు ఉన్న ఆవశ్యకతను కమిషన్ సభ్యుడికి వివరించారు. మహబూబాబాద్ జిల్లాలో 42 శాతానికి పైగా గిరిజన జనాభా ఉందని, మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంతో పాటు మహబూబాబాద్, డోర్నకల్, ఇల్లందు అసెంబ్లీ నియోజకవర్గాలు గిరిజనులకు రిజర్వు చేయబడ్డాయని పేర్కొన్నారు. అలాగే పాలకుర్తి, నర్సంపేట నియోజకవర్గాల్లోని కొన్ని మండలాలు కూడా మహబూబాబాద్ న్యాయ జిల్లాలోకి వస్తాయని వివరించారు. 2022 జూన్‌లో మహబూబాబాద్ జిల్లా కోర్టు ప్రిన్సిపల్ జిల్లా, సెషన్స్ కోర్టుగా అప్‌గ్రేడ్ అయినప్పటికీ, పెరుగుతున్న జనాభా, కేసుల సంఖ్యకు అనుగుణంగా ప్రత్యేక కోర్టుల అవసరం ఉందని న్యాయవాదులు తెలిపారు. ప్రస్తుతం వరంగల్‌లోని సంబంధిత కోర్టులపై పనిభారం అధికంగా ఉండటంతో ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన బాధితులకు సత్వర న్యాయం అందడంలో జాప్యం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. బాధితులకు త్వరితగతిన న్యాయం అందించడంతో పాటు కేసుల విచారణను వేగవంతం చేసేందుకు మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో ప్రత్యేక ఎస్సీ, ఎస్టీ కోర్టును ఏర్పాటు చేయడం అత్యంత అవసరమని వారు కోరారు. బార్ అసోసియేషన్ ప్రతినిధుల వినతిపై జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాతోత్ హుస్సేన్ నాయక్ సానుకూలంగా స్పందించినట్లు న్యాయవాదులు తెలిపారు. ఈ సమస్య పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకునేలా ఉన్నతాధికారులకు, ప్రభుత్వానికి సిఫార్సు చేస్తానని ఆయన హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మామిడాల సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి జంగం సిద్ధార్థ, కోశాధికారి కొత్ర మున్నా, స్పోర్ట్స్ సెక్రటరీ బుర్ర శ్రీనివాస్ గౌడ్, కార్యవర్గ సభ్యుడు దర్శనం రామకృష్ణ, సీనియర్ న్యాయవాదులు తుంపిళ్ల శ్రీనివాస్, బి. అమర్‌నాథ్ గుప్తా, జంపాల విశ్వ, పిన్ని రాము తదితరులు పాల్గొన్నారు.

## ఆదివాసీ యువత క్రీడలతో పాటు హక్కులు, సంస్కృతి,సంప్రదాయాల పరిరక్షణకు కృషి చేయాలి పూనెం శ్రీనివాస్





- కొత్తగూడెంలో ఉమ్మడి ఖమ్మం--వరంగల్ జిల్లాల వాలీబాల్ టోర్నమెంట్ ఘనంగా నిర్వహణ

**మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 18(తరంగాలు**
):మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలం కొత్తగూడెశీ గ్రామపంచాయతీలో దసరా పండుగ సందర్భంగా ఆదివాసి సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో ఉమ్మడి ఖమ్మం, వరంగల్ జిల్లాల వాలీబాల్ టోర్నమెంట్‌ను ఘనంగా నిర్వహించారు. గత 25 సంవత్సరాలుగా దసరా పండుగ సందర్భంగా గ్రామంలో క్రీడా పోటీలు నిర్వహిస్తుండగా, ఈ ఏడాది కూడా అదే సంప్రదాయాన్ని కొనసాగిస్తూ వాలీబాల్ టోర్నమెంట్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆదివాసి సంక్షేమ పరిషత్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు, ఆదివాసి సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ తెలంగాణ చైర్మన్ పూనెం శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పూనెం శ్రీనివాస్ మాట్లాడుతూ ఉమ్మడి ఖమ్మం, వరంగల్ జిల్లాల వాలీబాల్ టోర్నమెంట్‌ను విజయవంతంగా నిర్వహించిన ఆదివాసి సంక్షేమ పరిషత్ నాయకులు, నిర్వాహకులు, గ్రామ యువతకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్న క్రీడాకారులందరినీ అభినందించారు. విజయం సాధించిన క్రీడాకారులు మరిన్ని విజయాలు సాధించాలని, ఓటమి పొందినవారు నిరుత్సాహపడకుండా తదుపరి పోటీల్లో గెలుపే లక్ష్యంగా ముందుకు సాగాలని సూచించారు. క్రీడలు క్రమశిక్షణ, ఐక్యత, పట్టుదల, సోదరభావాన్ని పెంపొందిస్తాయని ఆయన పేర్కొన్నారు. ఆదివాసీ యువత చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ విద్యతో పాటు క్రీడల్లోనూ ఉన్నత స్థాయికి ఎదగాలని పిలుపునిచ్చారు.

గ్రామీణ ప్రాంతాల్లోని ఆదివాసీ క్రీడాకారుల ప్రతిభను గుర్తించి, వారికి మరిన్ని అవకాశాలు కల్పించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు.

ఇలాంటి క్రీడా కార్యక్రమాలు ఆదివాసీ యువతలో ఐక్యతను పెంపొందించడంతో పాటు సమాజ అభివృద్ధికి దోహదపడతాయని అన్నారు. క్రీడలతో పాటు ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తెలిపారు. అలాగే ఆదివాసీల హక్కులు, ఏజెన్సీ ప్రాంతాల పరిరక్షణతో పాటు రాజకీయ, ఉద్యోగ రిజర్వేషన్లను కాపాడుకునేందుకు ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. భవిష్యత్ తరాల హక్కులను కాపాడుతూ ఆదివాసీ సమాజ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని కోరారు.

విజేతలకు నగదు బహుమతులు, షీల్డుల ప్రదానం

వాలీబాల్ టోర్నమెంట్‌కు సహకరించిన బహుమతుల దాతలు నగదు బహుమతులతో పాటు షీల్డులను అందించారు.

1. పూనెం శ్రీనివాస్: రూ.15,000 నగదు, షీల్డ్.
2. మెస్సు రఘువర్మ: రూ.12,000 నగదు, షీల్డ్.
3. కోర్సా సుమలత నరేష్, కొత్తగూడెం సర్పంచ్: రూ.10,000 నగదు, షీల్డ్.
4. వర్సా దీప ప్రకాష్, నామాలపాడు సర్పంచ్: రూ.8,000 నగదు, షీల్డ్.

పలువురు ప్రముఖుల పాల్గొనడం

ఈ కార్యక్రమంలో ఆదివాసి సంక్షేమ పరిషత్ మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి వర్సా ప్రకాష్, కొత్తగూడెం గ్రామ సర్పంచ్ కోర్సా సుమలత నరేష్, పూనెం మంగయ్య, మెస్సు రఘువర్మ, పూనెం రవి, అరెం కిచందర్, ఈసం రాధాకృష్ణ (లడ్డీ), చింత వినోద్, వట్టం రాజేష్, అరెం బాబు, వట్టం నారాయణ, ఈసాల సంజీవరావు, మాడే మహేష్, ఊకె రాకేష్ తదితరులతో పాటు గ్రామ పెద్దలు, యువత, మహిళలు పాల్గొన్నారు.



## నవరాత్రి ఉత్సవాలకు నక్షత్ర హారతి వితరణ

- అమ్మవారి సేవలో అడుప రాజు,కమలాకర్ సోదరులు
- అమ్మవారి సేవలో భాగస్వామ్యం కావడం సంతోషంగా ఉంది: బీజేపీ మండల అధ్యక్షుడు అడుప రాజు



అమ్మవారి సేవలో భాగస్వామ్యం కావడం సంతోషంగా ఉందని బీజేపీ వర్ధన్నపేట మండల అధ్యక్షుడు అడుప రాజు అన్నారు.గాయత్రి సేవా సమితి ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్న శ్రీ దుర్గాదేవి శరన్నవరాత్రి



ఉత్సవాల్లో భాగంగా అమ్మవారి పూజా కార్యక్రమానికి వినియోగించే నక్షత్ర హారతిని బీజేపీ మండల అధ్యక్షుడు అడుప రాజు, కమలాకర్ సోదరులు నవరాత్రి ఉత్సవ కమిటీకి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దుర్గామాత ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని, ప్రతి ఒక్కరి జీవితాల్లో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలు మన సంప్రదాయాలు, సంస్కృతిని పరిరక్షించడంతో పాటు ప్రజల్లో భక్తిభావాన్ని, ఐకమత్యాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. గాయత్రి సేవా సమితి ఆధ్వర్యంలో నవరాత్రి ఉత్సవాలను భక్తులకు ఆధ్యాత్మిక ఆనందాన్ని అందించేలా నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వర్ధన్నపేట మండల ఆయిల్ ఫామ్ రైతు కమిటీ అధ్యక్షులు తక్కలపల్లి సత్యనారాయణ రావు, గాయత్రి సేవా సమితి సభ్యులు, యువకులు పాల్గొన్నారు.

THARANGALU DAILY NEWS
సోమవారం, 19 అక్టోబర్ , 2026
జాతీయ దిన పత్రిక
తరంగాలు

## మేచరాజుపల్లిలో వైభవంగా సద్దుల బతుకమ్మ

- సర్పంచ్ తూర్పాటి శంకర్ ఆధ్వర్యంలో ఘనంగా శోభాయాత్ర
- డీజే సంగీతం, బతుకమ్మ పాటలతో మార్మోగిన గ్రామ వీధులు



**నెల్లికుదురు , అక్టోబర్ 18, (తరంగాలు ప్రతినిధి):** మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం మేచరాజుపల్లి గ్రామంలో ఆదివారం సద్దుల బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ తూర్పాటి శంకర్ ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ నిర్వహించిన బతుకమ్మ శోభాయాత్ర అంగరంగ వైభవంగా సాగింది. డీజే సంగీతం, సంప్రదాయ బతుకమ్మ పాటలు, మహిళల ఆటపాటలతో గ్రామంలో పండుగ సందడి నెలకొంది.గ్రామంలోని మహిళలు, యువతులు రంగురంగుల పూలతో అందంగా పేర్చిన బతుకమ్మలను తీసుకొని శోభాయాత్రలో పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. తంగేడు, గునుగు, బంతి, చామంతి తదితర పూలతో అలంకరించిన బతుకమ్మలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మహిళలు బతుకమ్మల చుట్టూ చేరి సంప్రదాయ పాటలు పాడుతూ నృత్యాలు చేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ తూర్పాటి శంకర్ మాట్లాడుతూ.. బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. ప్రకృతిని, పూలను ఆరాధించే ఈ పండుగ మహిళల ఐక్యతకు, కుటుంబ అనుబంధాలకు, సామాజిక సమైక్యతకు నిదర్శనమని పేర్కొన్నారు. గ్రామ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షిస్తూ బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం మహిళలు సంప్రదాయబద్ధంగా



బతుకమ్మలను నిమజ్జనం చేసి పరస్పరం పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామపంచాయతీ కార్యదర్శి, కారోబార్, గ్రామపంచాయతీ సిబ్బంది, గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు, ఆడపడుచులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.వేడుకల విజయవం తానికి సహకరించిన ప్రజాప్రతినిధులు, గ్రామపంచాయతీ సిబ్బంది, గ్రామ ప్రజలకు సర్పంచ్ తూర్పాటి శంకర్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గ్రామ ప్రజల సమష్టి భాగస్వామ్యంతో నిర్వహించిన ఈ వేడుకలు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల గొప్పతనాన్ని చాటిచెప్పాయి.

## హైదరాబాద్ 275 ఆలౌట్




విజయవాడ : ఆంధ్రతో రంజీ ట్రోఫీ రెండో మ్యాచ్‌లో హైదరాబాద్ తక్కువ స్కోరుకే పరిమితం అయింది. ఆదివారం మొదలైన గ్రూప్–బీ మ్యాచ్‌లో టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన సిరాజ్‌సేన తొలి ఇన్నింగ్స్‌లో 275 పరుగులకే ఆలౌటైంది. ఓపెనర్లు అభిరథ్ రెడ్డి (67), తన్మయ్ అగర్వాల్ (42) తొలి వికెట్‌కు 109 పరుగులు జోడించి మంచి పునాది వేసినా ఈ జోడీ విడిపోయిన తర్వాత హైదరాబాద్ వరుసగా వికెట్లు కోల్పోయింది. మిడిలార్డర్‌లో రాహుల్ రాదేశ్ (58 నాటౌట్) మాత్రమే ఆకట్టుకున్నాడు. ఆంధ్ర బౌలర్లలో విజయ్ 4, లలిత్ మోహన్, సౌరభ్ చెరో మూడు వికెట్లు పడగొట్టారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ఆతిథ్య ఆంధ్ర తొలి రోజు చివరకు వికెట్ నష్టపోకుండా 9 పరుగులు చేసింది.

### గిల్ ఒక్క పరుగుకే ఔట్

న్యూజిలాండ్ పర్యటనకు ముందు పంజాబ్ జట్టు తరఫున రంజీ బరిలో నిలిచిన టీమిండియా కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (1) నిరాశ పరిచాడు. చత్తీస్‌గఢ్‌తో మొదలైన మ్యాచ్‌లో ఐదు బంతులాడి ఒకే పరుగు చేసిన అతను లెఫ్టార్మ్ స్పిన్నర్ అజయ్ మండల్ బౌలింగ్‌లో బౌల్డ్ అయ్యాడు. గిల్ ఫెయిలైనా ఉదయ్ సహరన్ (106 బ్యాటింగ్), ప్రభ్‌సిమ్రన్ సింగ్ (62) సత్తా చాటడంతో పంజాబ్ తొలి రోజు ఆటను 269/4తో ముగించింది.

## అట్టహాసంగా పారా ఆసియాడ్ ఆరంభం.. ప్రారంభ వేడుకల్లో ప్రత్యేక ఆకర్షణగా భారత బృందం



నగోయా (జపాన్) : ఐదో ఎడిషన్ పారా ఆసియా క్రీడలు అట్టహాసంగా మొదలయ్యాయి. ఆదివారం జరిగిన ఆరంభ వేడుకల్లో భారత క్రీడాకారులు దేశ సంస్కృతిని ప్రపంచానికి చాటారు. 5 వేల ఏండ్ల నాటి మానవ నాగరికత వారసత్వాన్ని ప్రతిబింబించే ప్రత్యేక బ్లేజర్లను ధరించి మార్చ్‌ఫాస్ట్‌లో ఉత్సాహంగా పాల్గొన్నారు. పారా షట్లర్ ప్రమోద్ భగత్, పారా స్ప్రింటర్ సిమ్రాన్ శర్మ త్రివర్ణ పతాకాలను చేతబూని జట్టును ముందుండి నడిపించారు.భారత పారా అథ్లెట్లు ధరించిన అధికారిక బ్లేజర్లపై సింధు నాగరికత ముద్రలు, ప్రాచీన లిపి నమూనాలు ముద్రించారు. అలాగే కాలర్ భాగంలో సప్తసింధు నదుల ప్రాంతాన్ని స్మరిస్తూ డిజైన్ చేయగా, జేబుపై త్రివర్ణ పతాకాన్ని అలంకరించారు. ఈ క్రీడల్లో భారత్ తరఫున 11 విభాగాల్లో మొత్తం 168 మంది అథ్లెట్లు బరిలోకి దిగారు. ఈనెల 24 వరకు జరిగే ఈ మెగా గేమ్స్‌లో 45 దేశాల నుంచి సుమారు 3వేల మంది పారా అథ్లెట్లు పోటీ పడుతున్నాడు.

# దుర్గాదేవి అవతారంలో అమ్మవారి దివ్యదర్శనం







- భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు.. పాల్గొన్న యేడుకొండ సాత్విక్ దంపతులు

**వర్ధన్నపేట ప్రతినిధి, అక్టోబర్ 18,తరంగాలు:** వర్ధన్నపేట మండలం ఇల్లంద గ్రామంలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి, రామలింగేశ్వర స్వామి ఆలయంలో గాయత్రి సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా దుర్గాదేవి అలంకారంలో కొలువుదీరిన అమ్మవారు భక్తులకు దివ్యదర్శనమిచ్చారు. శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారిని దుర్గాదేవి రూపంలో సర్వాంగసుం దరంగా అలంకరించి, వేదమంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల నడుమ ప్రత్యేక పూజా కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.దుర్గాదేవి రూపంలో దర్శనమిచ్చిన జగన్మాతను దర్శించుకునేందుకు భక్తులు ఆసక్తి చూపగా, ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక శోభతో విరాజిల్లింది. అమ్మవారి దివ్యరూపాన్ని దర్శించుకున్న భక్తులు భక్తిపారవశ్యంలో మునిగిపోయారు. దుర్గామాత కరుణాకటాక్షాలు సకల జనులపై ఉండాలని, ప్రజలందరూ ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలతో సుఖసంతోషాలతో జీవించాలని భక్తులు ప్రార్థించారు.ఈ సందర్భంగా యేడుకొండ సాత్విక్ దంపతులు అమ్మవారి ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొని భక్తిప్రపత్తులతో పూజలు నిర్వహించారు. జగన్మాత ఆశీస్సులతో సర్వజనులకు శుభం కలగాలని ఆకాంక్షించారు.దుర్గాదేవి అనుగ్రహం సకల విఘ్నాలను తొలగించి, భక్తుల జీవితాల్లో సుఖశాంతులు, సిరిసంపదలు నింపుతుందనే విశ్వాసంతో భక్తులు అమ్మవారిని కొలుస్తూ ఆధ్యాత్మిక ఆనందాన్ని పొందారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బేతి సాంబయ్య, తక్కలపల్లి సత్యనారాయణ రావు, ఏరుకొండ వేణుగోపాలరావు, గాయత్రి సేవా సమితి సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



# రాజకీయంగా ఎదుర్కోలేక ఫ్లెక్సీ చించివేత






- తెలంగాణ రక్షణ సేన హుజూరాబాద్ నియోజకవర్గ ఇంచార్జ్ ఫిర్యాదు
- బాధ్యులను గుర్తించి చర్యలు తీసుకోవాలి: పోలీసులకు విజ్ఞప్తి
- ఫ్లెక్సీ చింపినంత మాత్రాన నా పోరాటాన్ని ఆపలేరు
- తెలంగాణ రక్షణ సేన హుజురాబాద్ నియోజకవర్గ ఇన్చార్జి సంతోష్ కుమార్ యాదవ్

**హుజూరాబాద్, అక్టోబర్ 18,(తరంగాలు ప్రతినిధి):** తెలంగాణ రక్షణ సేన హుజూరాబాద్ నియోజకవర్గ ఇంచార్జ్‌గా ప్రజా సమస్యలపై పోరాడుతూ, రాజకీయంగా ఎదుగుతున్న తనను అడ్డుకోవాలనే ఉద్దేశంతోనే గుర్తుతెలియని వ్యక్తులు తన ఫ్లెక్సీని చింపివేశారని తెలంగాణ రక్షణ సేన హుజురాబాద్ నియోజకవర్గ ఇన్చార్జి సంతోష్ కుమార్ యాదవ్ ఆరోపించారు. ఈ ఘటనపై హుజూరాబాద్ టౌన్ సీఐకి ఫిర్యాదు చేసినట్లు వెల్లడించారు.శనివారం ప్రకాష్ సైకిల్ స్టోర్ పైన ఉన్న హోర్డింగ్‌పై ఏర్పాటు చేసిన తన ఫ్లెక్సీని ఆదివారం సాయంత్రం గుర్తుతెలియని వ్యక్తులు చింపివేశారని తెలిపారు. ఈ ఘటన వెనుక ఎవరున్నారో పోలీసుల విచారణలో తేలాలని, బాధ్యులను గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.రాజకీయంగా తనను ఎదుర్కోలేకనే ఈ చర్యకు పాల్పడి ఉంటారని అనుమానం వ్యక్తం చేశారు. తన రాజకీయ ప్రత్యర్థులుగా ఉన్న బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల నాయకులపై అనుమానాలు ఉన్నప్పటికీ, విచారణలో వాస్తవాలు వెలుగులోకి రావాల్సి ఉందని పేర్కొన్నారు.

ఫ్లెక్సీలు చింపివేసినంత మాత్రాన తన ఆత్మవిశ్వాసాన్ని, పోరాటాన్ని, ప్రజల కోసం పనిచేయాలనే సంకల్పాన్ని దెబ్బతీయలేరని స్పష్టం చేశారు. తాను రాజకీయాల్లోకి వచ్చింది వ్యక్తిగత ప్రయోజనాల కోసం కాదని, ప్రజా సమస్యలపై పోరాడటమే తన లక్ష్యమని తెలిపారు. బీసీ నాయకుడిగా తన రాజకీయ ఎదుగుదలను అడ్డుకోవడం ఎవరి తరం కాదని ధీమా వ్యక్తం చేశారు.ఈ ఘటనపై పోలీసులు సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.ఈ సందర్భంగా తనకు అండగా నిలిచిన హైకోర్టు న్యాయవాది, టీఆర్ఎస్ హుస్నాబాద్ నియోజకవర్గ ఇంచార్జ్ శ్రవణ్ కుమార్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో హుజూరాబాద్ నియోజకవర్గ నాయకులు దీటి రమేష్, బండ అశోక్, బింగి కార్తీక్ పాల్గొన్నారు.

